


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 176 | ఆదివారం 14 డిసెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## తిరువనంతపురంలో
## బీజేపీ చారిత్రాత్మక విజయం..

- స్పందించిన మోదీ, శశిథరూర్
- క్షేత్రస్థాయిలో కార్యకర్తల కృషి వల్లే బీజేపీ గెలిచిందన్న మోదీ
- కేరళ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ప్రజలు విశ్వసించారని వ్యాఖ్య
- నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఈ ఎన్నికలు నిదర్శనమన్న శశిథరూర్



**తిరువనంతపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 13**

తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఇది కేరళ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మలుపు అని ఆయన అభివర్ణించారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్‌ను ఓడించడానికి క్షేత్రస్థాయిలో తమ కార్యకర్తలు చేసిన కృషి కారణమని ఆయన పేర్కొన్నారు. తిరువనంత పురంలో గెలుపు కోసం కృషి చేసిన బీజేపీ కార్యకర్తలను ఆయన అభినందించారు. కేరళ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ఇదే విషయాన్ని తిరువనంతపురం ప్రజలు విశ్వసించారని అన్నారు. తిరువనంతపురం అభివద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బీజేపీ కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో

- మిగతా 2లో..

## అమరులకు నివాళులర్పించిన
## మోడీ, రాహుల్

**న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, డిసెంబర్ 13**

డిసెంబర్ 13, 2001వ సంవత్సరంలో పార్లమెంటుపై దాడి జరిగింది. ఈ దాడిలో ఒకరు సెక్యూరిటీ సిబ్బంది, ఒక పౌరుడితో సహా 14 మంది మృతి చెందారు. ఈ మృతులకు నేడు పార్ల మెంటు భవనంలో ప్రధాని మోడీ, ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ,

- మిగతా 2లో..



# ఢిల్లీలో నేడు మహాధర్నా

## - రాహుల్‌గాంధీతో కలిసి హస్తినకు రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్- సూర్య వాస్తవం, డిసెంబర్ 13**

ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఏఐసీసీ చేపట్టిన మహాధర్నాలో పాల్గొనేందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లారు. సాకర్ స్టార్ మెస్సీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫ్రెండ్లీ ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు హైదరాబాద్‌కు వచ్చిన రాహుల్‌గాంధీ తిరుగు ప్రయాణం అయ్యారు. ఆయనతోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా వెళ్లారు. ఆదివారం రామ్‌లీలా మైదానంలో జరగనున్న మహార్యాలీలో ఆయన పాల్గొననున్నారు. ధర్నాలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు,



ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మెన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఢిల్లీకి తరలివెళ్లారు.

# నేడు రెండో విడత పోరు

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- 3,911 గ్రామాలు, 29,917 వార్డుల్లో ఎన్నికలు
- 3,769 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్.. రూరల్ ఏరియాల్లో వీడియోగ్రఫీ
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు
- రూ.8,59,39,828 నగదు సీజ్..33,262 మంది బైండోవర్
- తెలంగాణ ఎన్నికల సంఘం వెల్లడి




**హైదరాబాద్- సూర్య వాస్తవం డిసెంబర్ 13**

రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లో నేడు రెండో విడత పోరు జరగనుంది. 193 మండలాల్లోని 3,911 పంచాయతీల్లో జరగనున్న సర్పంచ్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్టు ఎన్నికల సంఘం శనివారమొక ప్రకటనలో తెలిపింది. సర్పంచ్ స్థానాలకు 12,782 మంది, వార్డు స్థానాలకు 71,071 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు

- మిగతా 2లో..



## కోటి సంతకాల తరలింపు...

- జిల్లాల కేంద్రాల నుంచి తాడేపల్లికి ర్యాలీలకు అనుమతి కోరిన వైసీపీ
- కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై వైసీపీ నిరసన
- కోటి సంతకాల సేకరణ కార్యక్రమంపై డీజీపీకి లేఖ
- సంతకాల పత్రాలను గవర్నర్‌కు సమర్పించనున్న జగన్

2లో

# నా ఉన్నతికి కారణం ఉపాధ్యాయులే..

- విద్యతో పాటు విలువలు ముఖ్యం
- మంగళగిరి డాన్ బాస్కో పాఠశాల స్వర్ణోత్సవాలకు హాజరైన మంత్రి లోకేశ్
- పాఠశాలకు పూర్తి సహకారం అందిస్తానని విద్యాశాఖల మంత్రిగా హామీ
- కలిసికట్టుగా పాఠశాలను బలోపేతం చేద్దామని పిలుపు



**అమరావతి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13**

విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, మానవతా విలువలు కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. తాను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నానంటే దానికి తన

- మిగతా 2లో..



## ఏపీలో నూతన కానిస్టేబుళ్లకు
## 16న నియామక పత్రాలు..

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- ఏర్పాట్లను పరిశీలించిన హోంమంత్రి వంగలపూడి అనిత
- అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు హాజరయ్యేలా ఏర్పాట్లు

**అమరావతి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13**

రాష్ట్రంలో కొత్తగా కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నిరీక్షణకు తెరపడనుంది. ఈ నెల 16వ తేదీన వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. మంగళగిరిలోని ఏపీఎస్పీ 6వ బెటాలియన్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించను న్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమం కోసం జరుగుతున్న ఏర్పాట్లను ఆమె స్వయంగా పరిశీలించారు. డీఐజీ ఏసుబాబు, గుంటూరు జిల్లా ఎస్పీ వకుళ్ జిందాల్,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# జరీబ్ భూమి సమస్యలపై కమిటీ

- లంక భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేస్తాం
- అమరావతి రైతుల సమస్యలను పరిష్కరిస్తాం
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు - సూర్య వాస్తవం, డిసెంబర్ 13**

జరీబ్ భూమి సమస్యపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఈ కమిటీ రెండు వారాల్లోగా నివేదిక అందజేయనుందని తెలిపారు. దీంతో పాటు సుమారు 180 ఎకరాల భూమిపై సాయిల్ టెస్టింగ్,

- మిగతా 2లో..



## అమరులకు నివాళులర్పించిన
# మోడీ, రాహుల్

(మొదటిపేజీ తరువాయి)
పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుతో పాటు పలువురు సీనియర్ పార్లమెంటు సభ్యులు కూడా నివాళులర్పించారు. కాగా, 2001లో డిసెంబర్ 13న లష్కరే తోయిబా (ఎల్ఇటి), జైషే మహ్మద్ (జెఎం) ఉగ్రవాద సంస్థలకు చెందిన ఐదుగురు భారీ ఆయుధాలతో పార్లమెంట్ క్లాంప్లెక్స్‌లో చొరబడి విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 14 మంది మృతి చెందారు.

## తిరువనంతపురంలో
# బీజేపీ చారిత్రాత్మక విజయం..

(మొదటిపేజీ తరువాయి)
విజయం సాధించిన బీజేపీ నేతలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ శశిథరూర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫలితాలు నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. 45 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ చేస్తున్న అక్రమాలను తాను చాలాసార్లు ప్రశ్నించానని, వారి పాలన నుంచి ప్రజలు బయటపడాలని కోరుకున్నారని అన్నారు. ఈ ఫలితాలు కూడా అదే విషయాన్ని తెలియజేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. మొత్తం 101 వార్డుల్లో బీజేపీ 50 స్థానాల్లో గెలుపొందగా, ఎల్డీఎఫ్ 29, యూడీఎఫ్ 19, స్వతంత్ర అభ్యర్థులు 2 స్థానాల్లో విజయం సాధించారు.

## ఏపీలో నూతన కానిస్టేబుళ్లకు
# 16న నియామక పత్రాలు..

(మొదటిపేజీ తరువాయి)
బెటాలియన్ కమాండెంట్ నగేష్ బాబుతో కలిసి ఆమె ఏర్పాట్లను పర్యవేక్షించి, పలు సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు తమ కుటుంబసభ్యులతో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు హోంమంత్రి తెలిపారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

# జరీబ్ భూమి సమస్యలపై కమిటీ

(మొదటిపేజీ తరువాయి)
వాటర్ లెవెల్ స్టడీపైనా నివేదిక అందుతుందని వివరించారు. అమరావతి రాజధాని అవసరాల దృష్ట్యా సుమారు 2500 ఎకరాలను భూసేకరణ ద్వారా తీసుకుంటున్నామని, లంక భూములకు సంబంధించి గతంలో ఉన్న న్యాయపరమైన సమస్యలు అధిగమించి రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేస్తామని తెలిపారు. అమరావతి రాజధాని పరిధిలో రైతుల సమస్యలపై గుంటూరులో నిర్వహించిన అమరావతి త్రిసభ్య కమిటీ సమావేశం శనివారం రాయపూడి సిఆర్‌డిఏ కార్యాలయంలో జరిగింది. అనంతరం మీడియాతో పెమ్మసాని మాట్లాడుతూ.. గ్రామకంఠాల విషయంలో పది సెంట్లకు పైగా ఉన్న భూములపై సమగ్ర వెరిఫికేషన్ చేపడుతున్నామని, మొత్తం అంచనా 1600 ఎకరాలు ఉంటాయని తెలిపారు. రోడ్ హిట్ ల్యాండ్స్, టిడిఆర్ బాండ్స్, నష్టపరిహారం అంశాలపై రైతులకు నష్టం కలగకుండా న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటా మన్నారు. అమరావతి రైతుల సమస్యలను సాధారణ, తీవ్రమైన సమస్యలుగా విభజించి ఒక్కొక్క అంశాన్ని లోతుగా అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. మందడంలో రోడ్ అలైన్‌మెంట్‌కు సంబంధించి రెండు ప్రత్యామ్నాయాలను పరిశీలించామని, రైతుల అభిప్రాయాలు, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ సూచనల మేరకు ఆప్షన్-1ను తుది నిర్ణయంగా ఎంపిక చేశామని తెలిపారు. భూసేకరణకు సంబంధించి పరిశీలనలో ఉన్న దాదాపు 47 కేసులు పరిష్కార దశకు చేరాయని చెప్పారు. మిగిలిన కొద్ది కేసులు వచ్చే వారంలోపు పూర్తవుతాయన్నారు. మొత్తం 69,421 ప్లాట్లలో 61,793 ప్లాట్లు ఇప్పటికే రిజిస్ట్రేషన్ అయ్యాయని, మిగిలిన 7,628 ప్లాట్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ మంత్రి నారాయణ మాట్లాడు తూ.. అమరావతి రాజధానిలో సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అమరావతి పరిధిలోని 26 గ్రామాలకు సంబంధిం చిన అభివృద్ధి పనుల డిపిఆర్‌లు సిద్ధం చేస్తున్నామని, వాటిలో 12 గ్రామాల్లో పూర్తయ్యాయని, మిగిలినవి త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. 18 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, వీటి కోసం రూ.22.6 కోట్లు కేటాయించామని చెప్పా రు. తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# కోటి సంతకాల తరలింపు...

**అమరావతి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13**
రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ తన ఉద్యమాన్ని ఉద్ధృతం చేసింది. ఇందులో భాగంగా చేపట్టిన 'కోటి సంతకాల సేకరణ' కార్యక్రమానికి సంబంధించి వాహన ర్యాలీలకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఆ పార్టీ రాష్ట్ర డీజీపీకి అధికారికంగా లేఖ రాసింది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఈ మేరకు డీజీపీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సేకరించిన కోటి సంతకాల పత్రాలు ఈ నెల 10వ తేదీన జిల్లా కేంద్రాలకు చేరుకున్నాయి. ఈ పత్రాలను డిసెంబరు 15న తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించాల్సి ఉంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాల నుంచి తాడేపల్లి వరకు వాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు వైసీపీ తెలిపింది.

ఈ ర్యాలీలు, సంతకాల పత్రాల రవాణా సజావుగా సాగేందుకు అనుమతి అవసరమని, దీని కోసం అన్ని జిల్లాల ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని లేళ్ల అప్పిరెడ్డి తన లేఖలో డీజీపీని కోరారు. తాడేపల్లికి పత్రాలు చేరుకున్న అనంతరం, డిసెంబరు 18న పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్‌ను కలిసి ఈ సంతకాల పత్రాలను అధికారికంగా సమర్పిస్తారని లేఖలో పేర్కొన్నారు.

# నేడు రెండో విడత పోరు

(మొదటిపేజీ తరువాయి)
పోలింగ్, ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించనున్నారు. సాయంత్రం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తామనీ, వీలు కాకుంటే సోమవారం పూర్తి చేయనున్నారు. ఇప్పటికే అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్ల నియామకం జరిగింది. 99 శాతం ఓటర్ స్లిప్‌ల పంపిణీ, సిబ్బందికి శిక్షణ పూర్తి అయ్యినట్టు పేర్కొంది. 31 జిల్లాల్లో 38,337 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. 57,22,665 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 27,96,006 మంది పురుష ఓటర్లు, 29,26,306 మంది మహిళా ఓటర్లు, 153 మంది ఇతరులు ఉన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 4,593 మంది రిటర్నింగ్ అధికారులను, 30,661 మంది ఇతర సిబ్బందిని నియమించారు. మూడు విడతలకు కలిపి మొత్తం 2,489 మైక్రో అబ్జర్వర్లను నియమించినట్టు ఎన్నికల సంఘం తెలిపింది.

ఓటు వేసే వారు తమ ఎలక్షన్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర 18 రకాల ఐడీ కార్డులను అనుమతించినట్టు ఎన్నికల సంఘం పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడతలో 3,769 పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ నిర్వహిస్తున్నారు. దీన్ని సెంట్రలైజ్ చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు లాగిన్ పాస్వర్డ్ ఇచ్చింది. ఏఏ పోలింగ్ స్టేషన్లో ఏం జరుగుతుందో వీరు తమ లాగిన్ ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షించే అవకాశం ఉంటుంది. ఎక్కడైనా పోలింగ్, ఇబ్బందులు, ఇతర శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు తక్షణమే స్పందిచి తగు చర్యలు తీసుకుంటారు. నెట్ సౌకర్యం లేని మారుమూల ప్రాంతాల్లో లోకల్ వీడియో రికార్డింగ్ ఏర్పాటు చేశారు. అలాగే ఫిర్యాదుల కోసం 92400212456 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. ఓటర్లందరూ పోలింగ్‌లో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది.

**8.59 కోట్ల నగదు స్వాధీనం**

గ్రామపంచాయతీ ఎన్నికల కోడ్ అమలైనప్పటినుంచి ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.8,59,39,858 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎన్నికల సంఘం తెలిపింది. రూ.2.28,27,539 విలువైన మత్తు పదార్థాలు, రూ.3,46,95,639 విలువైన మద్యం సీజ్ చేశామని పేర్కొంది. 12,15,500 విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.69,16,560 విలువ చేసే ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపింది. ఇప్పటి వరకు 3,675 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామనీ, 33,265 మందిని బైండోవర్ చేసినట్టు పేర్కొన్నారు.. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని ఎన్నికల సంఘం వివరించింది.

# నా ఉన్నతికి కారణం ఉపాధ్యాయులే..





(మొదటిపేజీ తరువాయి)
ఉపాధ్యాయులే కారణమని ఆయన గుర్తుచేసుకున్నారు. మంగళగిరిలోని డాన్ బాస్కో ఉన్నత పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలకు లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో స్వర్ణోత్సవ శిలాఫలకాన్ని, నూతన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో లోకేశ్ మాట్లాడుతూ.. "డాన్ బాస్కో అంటే ప్రేమ, సేవ. అనాథలకు అండగా నిలుస్తూ, ఇల్లు లేని వారికి నీడ కల్పిస్తూ, ఆకలితో ఉన్నవారికి అన్నం పెడుతున్న గొప్ప వ్యవస్థ ఇది. 50 ఏళ్లుగా దివ్యాంగులకు అండగా నిలుస్తూ వారి పురోభివృద్ధికి కృషి చేస్తోంది" అని ప్రశంసించారు. తెలుగు రాష్ట్రాల్లో సుమారు 35 పాఠశాలల ద్వారా విద్యతో పాటు విలువలను అందిస్తోందని కొనియాడారు.

పాఠశాల ఎదుర్కొంటున్న సమస్యలపై స్పందిస్తూ, ఎయిడెడ్ వ్యవస్థ రద్దయిన విషయాన్ని ప్రస్తావించారు. విద్యాశాఖ మంత్రిగా పాఠశాలకు అన్ని విధాలా అండగా నిలబడి, సమస్యల పరిష్కారానికి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఏ స్థాయికి వెళ్లినా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, పాఠశాలను మర్చిపోవద్దని సూచించారు. అందరం కలిసికట్టుగా పనిచేసి డాన్ బాస్కో పాఠశాలను దేశంలోనే అద్భుతమైన విద్యాసంస్థగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

## రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం డిమాండ్

**ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం, డిసెంబర్ 13:**

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర మాల మహా నాడు రామోజీ వర్గం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాలు మరియు పాస్టర్లు పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం జాతీయ అధ్యక్షులు రామోజీ ఇమ్మానియేల్ మాట్లాడుతూ ఇండియాలో ఎవరు చేయనటువంటి ఒక గొప్ప కార్యక్రమం తమిళనాడు సీఎం స్టాలిన్ దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చడం అనేది చాలా సంతోషించవలసిన విషయమని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కి కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాల మహానాడు రామోజీవర్గం కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ అసెంబ్లీ సమావేశాలలో దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని దళిత సంఘాలు పాస్టర్లు ఆధ్వర్యంలో విజ్ఞప్తి చేశారు.

అంతే కాకుండా ఈ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అనేక సంక్షేమ పథకాలు వెనుకబడి ఉన్నాయని, అభివృద్ధి లేదని ఎక్కడ చూసినా దళితవాడలో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా అభివృద్ధి పనులు చేయకుండా ఉన్నారని ధ్వజమెత్తారు. ఒక్కసారి ప్రభుత్వం ఆలోచించాలని ఆరోజు చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎక్కడ



పోయాయని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్రం మొత్తం కలిసి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. అంతేకాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్ని అబద్ధపు మాటలే చెప్పారని అధికారం ఇచ్చి కూడా రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటికి కూడా అబద్ధపు మాటలు, మాయ మాటలు చెప్పి దళితులను ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. చంద్రబాబు నాయుడు నోటిలో నుంచి వచ్చే మాటలు అన్ని అబద్ధాలే నిజాలు ఒక్కటి కూడా లేవని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడుకి దళితులు కనపడలేదా అని ప్రశ్నిస్తూ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు రామోజీ వర్గం జాతీయ అధ్యక్షులు రామోజీ ఇమ్మానియేల్, రాష్ట్ర సోషల్ మీడియా అధ్యక్షులు ఆకుమల్ల ప్రణయ్ కుమార్, రాష్ట్ర సమన్వయకర్త మేకల ఓబులేసు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఉల్లి కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు ఏసురత్నం, రాయలసీమ సోషల్ మీడియా అధ్యక్షులు సి కె కుమార్, రాయలసీమ ప్రధాన కార్యదర్శి సుద్ధపల్లి అరుణ్ కుమార్, కడప జిల్లా అధ్యక్షులు సంగటి పుల్లయ్య, కడప జిల్లా యువజన అధ్యక్షులు రామారావు, దైవజనులు కృప కుమార్, దైవజనులు డానియల్,రాష్ట్ర నాయకులు సాత్రి లక్ష్మయ్య, రాష్ట్ర నాయకులు జెస్టాది రవికుమార్, గాలిపోతుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారత్ వద్దా.. విదేశాలే ముద్దా...




భారతీయులకు విదేశాలపై మోజు పెరుగుతున్నది. చదువు కోసం, ఉపాధి కోసం, సమాజంలో గుర్తింపు కోసం అనేకమంది ఇతర దేశాల వైపు చూస్తున్నారు. పాశ్చాత్య దేశాల్లో ఉండటాన్ని ఓ హోదాలాగా భావిస్తున్నారు. పై కారణాల వల్లనే ఏటా లక్షల మంది భారత్‌ను వీడుతున్నారు. అయితే ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా గొప్పలు చెప్పుకొనే పాలకులు దేశంలోని యువతకు ఉపాధి చూపకపోవడమే భవిష్య భారతం తరలిపోవడానికి ప్రధాన కారణం. కొన్నేళ్లుగా లక్షల మంది భారతీయులు.. మన దేశ పౌరసత్వాన్ని వదిలేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే గత 5 ఏళ్లలో ఏకంగా 9 లక్షల మంది భారతీయులు.. తమ పౌరసత్వాన్ని వదులుకున్నారని కేంద్రం.. పార్లమెంటులో వెల్లడించింది. ఇక గత 14 ఏళ్లలో ఈ సంఖ్య 20 లక్షలు దాటినట్లు వెల్లడించింది. భారత పౌరసత్వాన్ని వదిలేసి.. విదేశీ పౌరసత్వాన్ని స్వీకరిస్తున్న వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతుండటం గమనార్హం. విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభకు వెల్లడించారు. గత 14 సంవత్సరాలలో ఈ సంఖ్య 20 లక్షలు దాటింది. ఇటీవల సంవత్సరాలలో విదేశీ పౌరసత్వాన్ని ఎంచుకునే భారతీయుల సంఖ్య స్థిరంగా పెరుగుతోంది. మరోవైపు, విదేశాంగ శాఖ విదేశీ ఉద్యోగాల కోసం నకిలీ ఆఫర్లకు ఆకర్షితులవుతున్న భారతీయ యువత గురించి ఆందోళన వ్యక్తం చేసింది. సోషల్ మీడియా ద్వారా మోసాలు జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి ప్రభుత్వం ఇ-మైగ్రేట్ పోర్టల్‌లో నమోదు కాని ఏజెంట్ల వివరాలను పొందుపరుస్తోందని మంత్రి తెలిపారు. భారతీయ పౌరసత్వాన్ని వదులుకునే వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ మేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్.. గురువారం రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత పౌరసత్వాన్ని వదిలేసుకున్న వారి గణాంకాలను పార్లమెంట్‌కు సమర్పించారు. గత 5 ఏళ్ల కాలంలో దాదాపు 9 లక్షల మంది భారతీయులు.. తమ పౌరసత్వాన్ని వదిలేసుకుని.. ఇతర దేశాల పౌరసత్వాలను తీసుకున్నట్లు కేంద్రమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. కేంద్రం వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 2011 నుంచి 2024 వరకు.. గత 14 సంవత్సరాల్లో 20 లక్షలకు పైగా భారతీయులు తమ పౌరసత్వాన్ని వదులుకున్నారని తెలుస్తోంది. భారత పౌరసత్వాన్ని వదులుకునే వ్యక్తులకు సంబంధించి.. వార్షిక రికార్డులను కేంద్ర ప్రభుత్వం భద్రపరుస్తుందని కేంద్రమంత్రి కీర్తి వర్ధన్ సింగ్ తెలిపారు. 2011-2019 మధ్య కాలంలో 11,89,194 మంది భారత పౌరసత్వాన్ని వదులుకున్నారని పేర్కొన్నారు. ఇటీవలి సంవత్సరాల్లో వేరే దేశాలకు చెందిన పౌరసత్వాలను తీసుకుంటున్న భారతీయుల సంఖ్య నిలకడగా పెరుగుతూ వస్తోందని కేంద్రమంత్రి తెలిపారు. ఏటా ఈ పౌరసత్వాలు వదిలేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు ఈ గణాంకాల్లో స్పష్టంగా తెలుస్తోంది. ఉదాహరణకు.. 2024లో 2,06,378 మంది.. 2022లో 2,25,620 మంది పౌరసత్వాన్ని వదులుకున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే భారతీయ యువత నకిలీ గల్ఫ్ ఉద్యోగ ఆఫర్ల బారిన పడుతూ అక్రమ రవాణా నెట్‌వర్క్‌ల ద్వారా మోసపోతున్నారని విదేశాంగ శాఖ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఈ సందర్భంగా పార్లమెంటుకు తెలిపారు. సోషల్ మీడియాలో వైరల్ అయ్యే జాబ్ ఆఫర్లను నమ్మి చాలా మంది మోసాలకు గురి అవుతున్నారని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి మోసాలను నివారించడానికి.. కేంద్ర విదేశాంగ శాఖ సోషల్ మీడియా ద్వారా దేశ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తోందని తెలిపారు. అదే సమయంలో రిజిస్టర్ కాని ఏజెంట్లపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ వెల్లడించారు. 2025 అక్టోబర్ నాటికి 3,505 నమోదు కాని ఏజెంట్ల వివరాలను.. ఈ-మైగ్రేట్ పోర్టల్‌లో పొందుపరిచినట్లు స్పష్టం చేశారు. భారతీయులు ఎక్కువగా విదేశాలకు ఎందుకు వెళ్తున్నారనే అంశంపై 'టైమ్స్ ఆఫ్ ఇండియా' 2023లో సర్వే చేసింది. ఆ సర్వే ప్రకారం.. విదేశాల్లో 8 గంటలే పని చేయాలన్న నిబంధనను కచ్చితంగా అమలుచేయడం, ఎక్కువ గంటలు పనిచేస్తే అందుకు నగదు చెల్లింపులు, తక్కువ ట్రాఫిక్, తక్కువ గాలి కాలుష్యం, అవినీతి తక్కువగా ఉండటం తదితర కారణాలను సర్వేలో పాల్గొన్నవారు చెప్పారు. అదే సమయంలో భారత్‌లో ప్రభుత్వాలు రాజకీయ నాయకుల నిర్ణయాలపై నడవటం.. కులం, మతం, ప్రాంతం ప్రాతిపదికన అభివృద్ధికి విరోధం కలిగించడం.. అవినీతి, లంచం తదితర కారణాల వల్ల విదేశాల బాట పడుతున్నట్టు మరి కొంతమంది చెప్పుకొచ్చారు. ఉపాధి అవకాశాలు లేకపోవడం కూడా మరో కారణం. 'సెంటర్ ఫర్ మానిటర్ ఇన్ ఇండియన్ ఎకానమీ- 2022' నివేదిక ప్రకారం.. ఆ ఏడాది మొదటి 9 నెలల నిరుద్యోగ రేటు 7 శాతంగా ఉంటే డిసెంబర్‌లో 8.3 శాతానికి పెరిగింది. అర్బన్ నిరుద్యోగ రేటు 10.9 శాతంగా ఉండటం గమనార్హం. పత్రికా స్వేచ్ఛ లేకపోవడం, పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలుతో ఆర్థికవ్యవస్థ మందగమనం కూడా వలసలకు కారణాలే. ఎంతో ప్రతిభ ఉన్నవారు వలసలు పోవడం వల్ల మన దేశం భారీగా నష్టపోతున్నది. నాణ్యమైన విద్య, ఉపాధి, ఉద్యోగాలను కల్పించి ప్రజల జీవన ప్రమాణాలను పెంచి వలసలను తగ్గించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై దృష్టిసారించాలి.

# అమరావతికి అడ్డంకులు తొలగినట్టేనా



**విజయవాడ - సూర్య వాస్తవం**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని నోటిఫై చేయడానికి కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేస్తుందనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీనికి సంబంధించిన బిల్లును తిరిగి పంపించిందని కూడా వార్తలు వస్తున్నాయి. న్యాయపరమైన చిక్కులు, నిధులు సమస్యల కారణంగానే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని అంటున్నారు. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రం ఎలాంటి స్పందన లేదు. ఇంకా పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని ఎప్పుడైనా బిల్లు ఆమోదం పొందవచ్చని అంటున్నారు. మొత్తానికి ఈ వార్త ఇప్పుడు రాజకీయంగా చర్చనీయాంశమైంది. అమరావతిని ఆంధ్రప్రదేశ్‌గా నోటిఫై చేయించుకుంటే భవిష్యత్‌లో మార్పులు చేర్పులకు అవకాశం ఉందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత కమిషన్ వేసి అమరావతిని రాజధానిగా ఎంపిక చేసింది నాటి టీడీపీ ప్రభుత్వం. అయితే జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిని రాజధానిగా పెట్టేందుకు అంగీకరించలేదు. దీంతో మూడు రాజధానులు అంటూ సరికొత్త పల్లవి అందుకున్నారు. వివిధ కారణాలతో మూడు రాజధానుల వ్యవహారం కూడా ముందుకు సాగలేదు. తర్వాత జరిగిన ఎన్నికల్లో మూడు రాజధానుల వాదనను ప్రజలు తిరస్కరించారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అమరావతి మాత్రమే ఆంధ్రప్రదేశ్ రాజధాని అని స్పష్టం చేసింది. అక్కడ అభివృద్ధి పనుల కోసం వివిధ ఆర్థిక సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. కేంద్రం కూడా దీనికి ఓకే చెప్పింది.

అయితే కూటమి ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేసినా తర్వాత వచ్చిన ప్రభుత్వాలు మళ్లీ మార్చకుండా ఉంటాయా అనే అనుమానం ఉంది. దీంతో భవిష్యత్‌లో ఇలాంటి గందరగోళానికి ఆస్కారం లేకుండా ఉండేందుకు కేంద్రమే ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేసేలా ప్రయత్నాలు చేస్తోంది. అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా నోటిఫై చేయాలని కేంద్రానికి కూటమి ప్రభుత్వం బిల్ పంపించింది. 2014 నుంచి గుర్తించాలని పేర్కొంది. ఇలా చేస్తే చట్టపరమైన సమస్యలు వస్తాయని కేంద్రం భావిస్తుందని అంటున్నారు. 2024 నుంచి గుర్తిస్తే అప్పటి వరకు చేసిన ఖర్చులపై కూడా న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అందుకే ఇప్పటికే పంపిన బిల్లును తిరిగి వెనక్కి పంపించారని అంటున్నారు. ప్రత్యామ్నాయాలతో బిల్లు పంపించాలని సూచించినట్టు చెబుతున్నారు. తిరిగి వచ్చిన బిల్లుపై చంద్రబాబు సర్కారు న్యాయనిపుణులతో చర్చిస్తోందని అంటున్నారు. దీనికి పరిష్కార మార్గాలను కనుక్కునే పనిలో ఉన్నారని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు పూర్తి అయ్యే లోపుపంపిస్తే కేంద్రం అంగీకరించి సభలో ప్రవేశ పెట్టే ఛాన్స్ ఉందని అంటున్నారు. లేకుంటే మళ్లీ బడ్జెట్ సమావేశాల వరకు ఎదురు చూడాల్సి వస్తుందని చెబుతున్నారు. ఈ వ్యవహారంపై అటు కేంద్రం నుంచి కానీ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కానీ ఎలాంటి ప్రకటనలు చేయలేదు. టీడీపీ వర్గాలు కూడా సైలెంట్‌గా ఉన్నాయి. కేంద్రానికి బిల్లు పంపిన సంగతిని మాత్రం ఇప్పటికే ప్రకటించారు. పీ క్యాబినెట్ మే 19, 2025న అమరావతిని రాజధానిగా గుర్తించే రెజల్యూషన్ ఆమోదించి, కేంద్రానికి పంపింది. ఈ రెజల్యూషన్‌లో 2014-2024 వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉన్న విషయాన్ని పేర్కొంటూ, 2024 తర్వాత అమరావతిని ఏకైక క్యాపిటల్‌గా చట్ట చేయానలని కోరుతున్నారు.

కేంద్ర న్యాయమంత్రిత్వ శాఖ ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లుగా తెలుస్తోంది. కేంద్రం 2014 చట్టం సెక్షన్ 5(2)ను సవరించే బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఈ బిల్లు అమరావతిని రాజధానిగా చట్టబద్ధంగా గుర్తిస్తూ, భవిష్యత్ ప్రభుత్వాలు రాజధాని మార్చకుండా రక్షణ ఇస్తుంది. అయితే, రెట్రోస్పెక్టివ్‌గా 2014 నుంచే అమరావతిని గుర్తించాలా లేక 2024 నుంచా అనే టెక్నికల్ ఇష్యూస్ వల్ల ఆలస్యమవుతోంది. యూనియన్ లా మినిస్ట్రీ డ్రాఫ్ట్ బిల్లుపై కొన్ని ప్రశ్నలు లేవ ని, సరైన లీగల్ జస్టిఫికేషన్‌తో మళ్లీ సమర్పించమని చెప్పింది. నవంబర్ 22, 2025న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోం మంత్రి అమిత్ షాతో చర్చించారు. డ్రాఫ్ట్ బిల్లు యూనియన్ లా డిపార్ట్‌మెంట్ పరిశీలనలో ఉంది. ఈ బిల్లు యూనియన్ క్యాబినెట్ ముందుకు రానుందని, తదుపరి పార్లమెంట్ సెషన్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కేంద్ర మంత్రి వర్గంలో బిల్లు చర్చించిన తర్వాత పూర్తి స్పష్టత వస్తుందని అధికారుల అంచనా.

# శతాధిక చోట్ల పుస్తకావిష్కరణ

## - మూడు వందల గ్రంథాలయాలకు గ్రంథం చేరవేత

**గుంటూరు - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ అహ్మద్ రచించిన వెలువరించిన నూతన పరిశోధనాత్మక పుస్తకం "అల్లూరికి అండగా నిలిచిన ఫజుల్లా ఖాన్ -షేక్ మదీనా" రెండు తెలుగు రాష్ట్రాలలో డిసెంబర్ 17న సుమారు వంద చోట్ల విడుదల అవుతుంది. సయ్యద్ నశీర్ అహమ్మద్ రచించి ప్రచురించిన "మహాత్మా గాంధీ ముస్లిం సహచరులు, అనుచరులు", "పండిత్ రామ ప్రసాద్ బిస్మిల్ - అష్ఫాఖుల్లా ఖాన్", "ఆధునిక భారత దేశం మొదటి ముస్లిం ఉపాధ్యాయురాలు : ఫాతిమా షేక్", "మహాత్మా గాంధీ ప్రాణ రక్షకుడు: బతాక్ మియా అన్సారీ" పుస్తకాలు కూడా భారతదేశంలోని పలు రాష్ట్రాలలో వందలాది చోట్ల గతంలో ఆవిష్కరింబడ్డాయి. ఆ తరహాలోనే ప్రస్తుత సరికొత్త గ్రంథాన్ని కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఆవిష్కరణకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. 1999లో భారత స్వాతంత్ర్య సమరంలో ముస్లింల పాత్రపై సయ్యద్ నశీర్ అహమ్మద్ రాయడం ప్రారంభించినప్పటి నుండి తన కుటుంబం, స్నేహితుల ఆర్థిక సహాయంతో ప్రచురించిన పలు పుస్తకాలను ఎంపిక చేసిన లైబ్రరీలు, చరిత్ర ఉపాధ్యాయులు, చరిత్ర అధ్యాపకులకు, పాత్రికేయులకు, రచయితలు, ప్రచార మాధ్యమాల సంస్థలకు , ఆసక్తి చూపే పాఠకులకు తన వదాన్యుల కానుకగా అందజేస్తూ వచ్చారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ముస్లింల పాత్రపై ఇప్పటివరకు 25 పరిశోధనాత్మక చరిత్ర గ్రంథాలనుప్రచురించిన చరిత్రకారుడు నశీర్ అహమ్మద్ ప్రస్తుతం తన 26వ 26వ గ్రంథంగా " అల్లూరికి అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్ - షేక్ మదీనా," ను వెలువరించారు. ఈ పుస్తకంలో మన్యం పోరాట యోధులు శ్రీ అల్లూరి సీతారామరాజుకు అండగా నిలిచిన ఫజులుల్లా ఖాన్, షేక్ మదీనాల గురించి పేర్కొన్నారు. ఆ కాలంలో ఫజులుల్లా ఖాన్ గోదావరి జిల్లాలలోని పోలవరంలో బ్రిటిష్ ప్రభుత్వ డెప్యూటీ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.. ఈయన అల్లూరి సీతారామరాజు పినతండ్రి రామకృష్ణరాజు సన్నిహిత స్నేహితుడు. అల్లూరి రామకృష్ణరాజు, అల్లూరి సీతారామరాజు కుటుంబ సభ్యులతో తనకు గల సన్నిహిత సంబంధం, భారత స్వాతంత్ర్య సమరయోధులు, భారత జాతీయ ఉద్యమం పట్ల సానుకూల వైఖరి, సానుభూతి కలిగి ఉండటం వల్ల, ఫజుల్లా ఖాన్ ఆంగ్లేయ ప్రభుత్వం మీద పోరాటానికి శ్రీకారం చుట్టిన అల్లూరి సీతారామరాజు కు ఆయన సహకరించారు. ఆ కారణంగా సీతారామ రాజు మన్యంలో తిరుగుతూ మన్యం ప్రజలను ఆంగ్లేయుల మీద పోరాటానికి సిద్ధం చేశారు. ఫజులుల్లా ఖాన్ అనారోగ్యం కారణంగా అల్లూరి సీతారామరాజు నేతృత్వంలో సాగిన "మన్యం ఫితూరి" కి చివరి వరకు సహాయం చేయలేకపోయారు. 1922 జులై 27న ఫజులుల్లా ఖాన్ చనిపోయారు. ఆయన మరణం తర్వాత అల్లూరి శీతారామరాజు పోలీస్ స్టేషన్ల మీద దాడులకు శ్రీకారం చుట్టారు. ఆ తరువాత అల్లూరికి సహకరించిన మరొక యోధులు షేక్ మదీనా గురించి రచయిత నశీర్ అహమ్మద్ ఈ గ్రంథంలో పేర్కొన్నారు. అరవై సంవత్సరాల వయస్సు కలిగిన షేక్ మదీనా గోదావరి జిల్లాల పెద్దాపురంకు చెందినవారు. బ్రిటిష్ ప్రభుత్వంలో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేసి రిటైర్డ్ అయిన బ్రిటిష్ ప్రభుత్వ ఉద్యోగి. ఆయన అల్లూరి సీతారామరాజు తుపాకీ కాల్చడంలో శిక్షణ ఇచ్చారు. అల్లూరి శీతారామరాజు తన స్నేహితులతో కలసి పెద్దాపురానికి వచ్చి మదీనాకు చేసిన విజ్ఞప్తి మేరకు సీతారామరాజుకు ఆయన శిక్షణ ఇచ్చారు. సీతారామ రాజు షేక్ మదీనా శిక్షణలో మూడు రోజుల పాటు పెద్దాపురంలో ఉన్నారు. ఈమేరకు ఎన్నో పుస్తకాలు, మరెన్నో పాత డాక్యుమెంట్లు, పలువురు వ్యక్తుల నుండి రాబట్టిన సమాచారంతో అల్లూరి శీతారామరాజు, ఫజులుల్లా ఖాన్, షేక్ మదీనా ల మీద 96 పేజీల పుస్తకాన్ని నశీర్ అహమ్మద్ రూపొందించారు. ఈ పుస్తకాన్ని మూడు భాగాలుగా విభజించి, మొదటి భాగంలో అల్లూరి శీతారామరాజు (1897-1924) గురించి రాశారు. రెండవ భాగంలో డెప్యూటీ కలెక్టర్ ఫజులుల్లా ఖాన్ వివరణాత్మక కథనం ఇచ్చారు. చివరి భాగంలో షేక్ మదీనా జీవిత చిత్రణ అందించారు. ఈ గంధాన్ని వదాన్యుల ఆర్థిక చేయూతతో మూడు వేల ప్రతులు ముద్రించి 2025 డిసెంబర్ 14 నాటికి పైన పేర్కొన్నట్లు కొన్ని గ్రంథాలకు, సంస్థలకు, వ్యక్తులకు పంపిణీ పూర్తి చేశారు. ప్రస్తుతం 2025 డిసెంబర్ 17న తెలుగు రెండు రాష్ట్రాల్లో, తెలుగు ప్రజలు గణనీయ సంఖ్యలో నివసించే పొరుగు రాష్ట్రాల్లో కూడా ఈ గ్రంథం ఆవిష్కరణ కానుంది. ఆవిష్కరణ రోజుననే ఎంపిక చేసిన సుమారు మూడు వందల గ్రంథాలయాలకు పుస్తకం అందించేందుకు కూడా ముమ్మరంగా ఏర్పాట్లు పూర్తయ్యాయని సయ్యద్ నశీర్ అహమ్మద్ తనను కలసిన విలేకరులకు శనివారం తెలిపారు.



# సిమెంట్ బెంచీల వితరణ



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** సింహాద్రిపురం మండలంలోని గురజాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు పప్పు రాములు రూ.55 వేలు విలువచేసే సిమెంట్ బెంచీలను వితరణ చేశారు. శనివారం గ్రామంలోని గురుకుంట కళ్యాణమండపంతోపాటు గ్రామంలో 12 బెంచీలను పప్పు రామలక్ష్మమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేయించారు. ఈ బెంచ్ ల ఏర్పాటు చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమానికి రిటైర్డ్ టీచర్ రాములు ముందుకు రావడం ఎంతో అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు రామ్మోహన్ రెడ్డితో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శబరిమల యాత్ర సుఖమయం కావాలి

**- అయ్యప్ప స్వామి దర్శనంతో సుఖశాంతులు కలగాలి**






**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** పులివెందుల మండల పరిధిలోని నల్లగుండు వారి పల్లె అయ్యప్ప స్వామి దీక్ష పూర్తి చేసి శబరిమలే అయ్యప్ప దర్శనం కోసం ఇరుముడి కట్టి శబరిమల యాత్ర సుఖమయం కావాలని అయ్యప్ప స్వాములు బయలుదేరి వెళ్లారు. వాటిలో భాగంగా ముందుగా గ్రామంలో ఉన్న సాయిబాబా ఆలయంలో షిరిడి సాయి నాధునికి పూజలు నిర్వహించి గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టి బయలుదేరారు. స్వాములు మాట్లాడుతూ మండల కాలం దీక్షను పూర్తిచేసుకుని శబరిమల యాత్రకు బయలుదేరుతున్న సందర్భంగా గురు స్వామి ఆశీస్సులతో ఇరుముడి కట్టుకొని అయ్యప్ప కొండకు వెళ్లే శుభ సమయంలో గ్రామస్థులు పాల్గొని శబరిమల అయ్యప్ప యాత్రకు సంఘీభావం తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అంజన్న ఆలయంలో విశేష పూజలు

**- ప్రత్యేక అలంకారంలో వీరాంజనేయ స్వామి**



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** సింహాద్రిపురం గ్రామంలో అతిపురాతనమైన ఆంజనేయ స్వామి ఆల యంలో శనివారం ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ ఆచార్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువ జామునే స్వామివారికి పంచామృత అభిషేకం సహస్ర నామార్చన అష్టోత్తర శతనామావళి తదితర పూజ కైకర్యాల అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు మాట్లాడుతూ ప్రతి శనివారం మంగళవారం భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించడం జరుగుతుందని, అంతేకాకుండా మంగళవారం శనివారాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు అనంతరం ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ జిల్లా కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డిని పరామర్శించిన బీటెక్ రవి

**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** కడప జిల్లా టీడీపీ కార్యదర్శి సింగారెడ్డి జయ రామి రెడ్డిని పులివెందుల నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి బీటెక్ రవి శనివారం ఆయన స్వగ ృహానికి వెళ్లి పరామర్శించారు. జయరామిరెడ్డికి గత కొన్ని రోజులుగా ఆరోగ్యం సరిలేకపోవడంతో ప్రయివేటు హాస్పిటల్లో చికిత్స పొందుతూ ఉన్నారు. కర్నూలు లోని ఓ ప్రయివేటు హాస్పిటల్లో చికిత్స తీసుకుని వేంపల్లె లోని ఆయన స్వగ ృహానికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవి, వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగట్టు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, సీనియర్ నాయకులు షబ్బీర్ తదితరులు వెళ్లి జయరామిరెడ్డి ని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ల సలహాలు సూచనలు పాటిస్తూ తొందరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. తొందరగా కోలుకొని టీడీపీ పార్టీ కి తమ విలువైన సేవలు, సూచనలు, సలహాలు అందించి పార్టీ ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని జయరామిరెడ్డి ని నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి కోరారు. జయరామిరెడ్డి ని పరామర్శించిన వారిలో చంద్రశేఖర్ రెడ్డి, వేమకుమార్, యాసిన్, మారుతి, మబుషరీఫ్, వార్డు సభ్యులు కంతూరి వెంకటేష్, కమటం హరికుమార్ రెడ్డి, అశోక్, గంగాధర్ తదితరులు ఉన్నారు.



# భీమారంగాన్ని హోల్ సేల్‌గా అమ్మేసిన మోడీ ప్రభుత్వం

**- ముఖ్యమంత్రి గారూ! అంగన్వాడీలపై అంత అలుసెందుకు?**
**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** మోడీ ప్రభుత్వం భీమారంగాన్ని టోటల్‌గా, హోల్ సేల్‌గా ప్రైవేట్ రంగానికి అమ్మేసిందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటివరకు భీమా రంగంలో 74శాతం వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టేటందుకు అనుమతి ఉండేదని, దానిని నూరు శాతానికి పెంచుతూ ఇటీవల కేంద్ర మంత్రివర్గం నిర?యం తీసుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఈ చర్య వలన ప్రజల జీవితకాలపు పొదుపు సంక్షోభంలో పడుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థకు ముప్పు అని తులసి రెడ్డి అన్నారు. ఈ నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు, చిన్నపిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అంగన్వాడీ, మినీ అంగన్వాడీ కేంద్రాలు ఎనలేని సేవ చేస్తున్నాయని, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు పట్టించు కోవడం లేదని తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం 42 రోజులపాటు సమ్మె చేశారు. ఆ సందర్భంగా తాము అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలన్నీ పరిష్కరిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చి 18 నెలలు అయినప్పటికీ అంగన్వాడీల సమస్యలను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం శోచనీయం. 2019 నుండి అంగన్వాడీ హెల్పర్ల ,వర్కర్ల వేతనాలు పెంచలేదు. మరొకవైపు ఈ ఆరు సంవత్సరాలలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పోయాయి. అందువలన తమ కనీస వేతనాన్ని నెలకు 26వేల రూపాయలకు పెంచాలని వారు డిమాండ్ చేయడం న్యాయ సమ్మతం. వారికి గ్రాట్యూటీ అమలు చేయాలి. సంక్షేమ పథకాలను అమలు చేయాలి .మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ అంగన్వాడీ సెంటర్లుగా మార్చాలని, వారిపై రాజకీయ వేధింపులకు స్వస్తి పలకాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని జరిగే
# బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

**- బాకే హాబీబుల్లా, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** గత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో పేదలకు, సామాన్య ప్రజలకు ఆధునాతన వైద్య కళాశాలలు, వాటి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో, కేంద్రం అనుమతితో 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేసేందుకు సంకల్పించింది. అందులో దాదాపు 7 కళాశాలలు పూర్తయ్యాయి. మిగిలిన వాటిని పూర్తిచేసి ప్రభుత్వమే నడపకుండా, కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటుపరం చేయాలని చూడటం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు కోట్లాది రూపాయల ఫీజులు కట్టలేక వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. ఈ కళాశాలలను ప్రైవేట్ వారికి అప్పగించే నిర?యాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, వాటిని ప్రభుత్వ యాజమాన్యంలోనే కొనసాగించాలని బాకే హాబీబుల్లా డిమాండ్ చేశారు. ఈ ప్రైవేటీకరణ నిర?యాన్ని నిలుపుదల చేయాలని కోరుతూ, రాష్ట్ర గవర్నర్ గారికి విన్నవించే కోటి సంతకాల ప్రతులను పంపే ఉద్యమము అనంతపురం వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వేంకట రామిరెడ్డి గారి ఆధ్వర్యంలో జరుగు బైక్ ర్యాలీ నందు ప్రజలు అందురు పాల్గొని జయప్రదం చేయాలనీ కోరుతున్నాము ఈ నెల 15 న నిర్వహించనున్న బైక్ ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సనాతన ధర్మ రక్షణే మన కర్తవ్యం

**-హిందూ సమ్మేళనంలో పాల్గొన్న**

**పులివెందుల నియోజకవర్గం ఇన్‌చార్జి బీటెక్ రవి**



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం, మన సంస్కృతి సంప్రదాయాలను తర్వాతి తరాలకు అందించడం ప్రతి ఒక్కరి కనీస కర్తవ్యం అని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పిలుపునిచ్చారు. శనివారం వెంపల్లె మండల కేంద్రంలో నిర్వహించిన "హిందూ ధర్మ రక్షణ సమ్మేళనం" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బీటెక్ రవి మాట్లాడుతూ సనాతన ధర్మం ప్రపంచానికే మార్గదర్శి అటువంటి గొప్ప ధర్మంపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి హిందువులందరూ కుల మతాలకు అతీతంగా ఏకం కావాలి. ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మమే మనల్ని రక్షిస్తుంది అని ఆయన పేర్కొన్నారు. దేవాలయాలు కేవలం ప్రార్థనా మందిరాలు మాత్రమే కావని, అవి మన సంస్కృతికి నిలయాలని, వాటి పవిత్రతను కాపాడటంలో భక్తులు చైతన్యవంతులు కావాలని సూచించారు. నేటి యువత పాశ్చాత్య పోకడలకు లోనుకాకుండా, మన పురాణాలు, ఇతిహాసాల్లోని గొప్పతనాన్ని తెలుసుకోవాలని, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి పునరంకితం కావాలని కోరారు.హిందూ ధర్మ రక్షణ కోసం జరిగే ఏ కార్యక్రమానికైనా, ఏ పోరాటానికైనా తన పూర్తి మద్దతు ఉంటుందని, భక్తుల పక్షాన తాను ఎప్పుడూ ముందుంటానని బీటెక్ రవి స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో వెంపల్లి ఇంచార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ రామముని రెడ్డి,పట్టణ అధ్యక్షుడు మామ వేమ కుమార్ ఆధ్యాత్మిక వేత్తలు, హిందూ ధర్మ ప్రచారకులు, భారీ సంఖ్యలో భక్తులు,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. జై శ్రీరామ్ జై హింద్ నినాదాలతో వెంపల్లె పురవీధులు మారుమోగాయి.



## భవన నిర్మాణం కోసం లిటరరీ
# అసోసియేషన్ క్లబ్ రూ.20 వేల విరాళం



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** పులివెందుల పట్టణం లోని జగనన్న కాలనీ కి వెళ్లే 100 అడుగుల రోడ్ మార్గాన స్నేహిత అమృత హస్తం సేవాసమితి నిర్మిస్తున్న నూతన భవన సముదాయ నిర్మాణం విషయం తెలుసుకున్న లిటరరీ అసోసియేషన్ క్లబ్ అధ్యక్షులు బాలిరెడ్డి, కార్యదర్శి స్వామి నాథ్ రెడ్డిలు 20వేల రూపా యలు విరాళం మొత్తాన్ని వారు క్లబ్ ఆవరణంలో స్నేహిత అమ ృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ కోవిడ్ -19 విపత్తు లలో స్నేహిత అమ ృత హస్తం సేవాసమితి బ ృందం చేసిన సేవలకు మెచ్చి, అలాగే అంధత్వ నివారణ కోసం కార్నియా సేకరణ (నేత్రదానం), ఉచిత కోచింగ్ రంగాలలో అందిస్తున్న విశిష్ట సేవలకు గాను స్నేహిత అమ ృత హస్తం సేవల విస్తృతికి భవన సాముదాయం అవసరం ఎంతైనా ఉందని అందుకు మా వంతు బాధ్యత గా లిటరరీ అసోసియేషన్ క్లబ్ తరపున 20 వేలు ప్రస్తుతం ఈ విరాళం అందజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ విరాళాలు ఇవ్వదలచిన దాతలు 9966509364కి సంప్రదించాలని కోరుతూ భవన నిర్మాణంలో భాగస్వాములు అయిన లిటరరీ అసోసియేషన్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# హిందూ సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొన్న తులసిరెడ్డి





**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** శనివారం వేంపల్లిలో మధు రెడ్డి కళ్యాణమండపంలో హిందూ సమ్మేళనం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సమ్మేళనంలో పీఠాధిపతులు శ్రీ తురియానంద్ సరస్వతి స్వామి, స్వరూపానందగిరి స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కూడా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ,వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, ఐచర్ రమణ, చిన్నకోట్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. పీఠాధిపతులను తులసి రెడ్డి శాలువాలతో సత్కరించారు. పీఠాధిపతులు తులసి రెడ్డికి, కాంగ్రెస్ నాయకులకు ఆశీర్వాదం ఇచ్చారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ హిందూ మతం అత్యంత ప్రాచీనమైనదని , క్రీస్తుపూర్వం 2300 సంవత్సరాల నుంచి సింధూ నాగరికతతో ప్రారంభమైందని అన్నారు. ఎక్కువమంది ఆచరించే మతాల్లో హిందూ మతం మూడో స్థానంలో ఉందని ,ప్రపంచవ్యాప్తంగా 116 కోట్లమంది హిందూ మతాన్ని ఆచరిస్తున్నారని ,అందులో 94 శాతం మంది భారతదేశంలో ఉన్నారని తులసి రెడ్డి అన్నారు. అహింసా పరమో ధర్మః, ధర్మో రక్షతి రక్షితః ,ఆత్మవత సర్వభూతానం అని హిందూ మతం చెబుతుందని తులసి రెడ్డి అన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమే అని తులసి రెడ్డి అన్నారు.

## ఘనంగా గుమ్మనూరు ఈశ్వర్ జన్మదిన వేడుకలు

### - పేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన స్టోర్ డీలర్ శ్రీరాములు



**పామిడి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** పామిడి గుత్తి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ పుట్టినరోజును పురస్కరించుకొని పామిడి భోగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుమ్మనూరు ఈశ్వర్ నిండు నూరేళ్లు అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటూ వృద్ధులకు దుప్పట్లు, అల్పాహారం పంపిణీ చేసిన పామిడి టిడిపి సీనియర్ నాయకులు, పశువుల శ్రీరాములు, భోగేశ్వర దేవాలయ కమిటీ సభ్యురాలు పశువుల రామలక్ష్మి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు జనసేన వడ్డే రాము, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్ర సారస్వత పరిషత్ మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయండి



**గోరంట- సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్లలోని మారెమ్మ దేవాలయంలో రచయితలు డాక్టర్ షమీవుల్లా, నరెద్దుల రాజారెడ్డి, టి.వి.రెడ్డి, దేవాలయ ప్రధాన అర్చకులు డాక్టర్ దేవి స్వామి, సాయినాథ్, రామ్మోహన్ రెడ్డి, శంకర్ పోస్టర్లను విడుదల చేస్తూ తెలుగు భాషను రక్షించుకోవడం మనందరి బాధ్యతగా గుర్తించాలని అందుకు జనవరి 3, 4, 5 తేదీలలో గుంటూరులో జరుగు ప్రపంచ తెలుగు మహాసభలలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**గోరంట్ల- సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సందర్భంగా డివిజన్ స్థాయిలో శనివారం ప్రారంభించారు. పుట్టపర్తి డివిజన్‌లో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లు కొత్తచెరువు గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్‌లో నిర్వహించారు. కొత్తచెరువు, గోరంట్ల మండలాల మధ్య మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన గోరంట్ల జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుంది, బ్యాటింగ్ చేసిన కొత్తచెరువు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 89 పరుగులు చేయడం జరిగింది. ఈ టార్గెట్‌ను గోరంట్ల మండల జట్టు 13 ఓవర్లలో పూర్తిచేసి విజయం సాధించడం జరిగింది. గోరంట్ల జట్టు రేపు మధ్యాహ్నం జరగబోయే సెమీఫైనల్‌లో పుట్టపర్తి టీంతో ఆడటం జరుగుతుందన్నారు.

## శ్రీసిటీని సందర్శించిన శాసనమండలి సభ్యులు రాంగోపాల్ రెడ్డి







**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నా రెడ్డి ఆహ్వానం మేరకు శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి శ్రీసిటీని సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీసిటీలో కొనసాగుతున్న పారిశ్రామిక కార్యకలాపాలు, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాలు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా డిసిఎమ్ఎస్ ఛైర్మన్ ఎర్రగుంట్ల జయప్రకాష్, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు శ్రీపతి బాబు తదితరులు పాల్గొన్నారు.

### అయ్యప్ప స్వామి మండల పూజ కార్యక్రమానికి

# మాజీ సర్పంచ్ పీవీ శివారెడ్డి విరాళం



**గోరంట- సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** గోరంట్ల పట్టణంలోని దామర ఒడ్డు వద్ద వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ మండల పూజా కార్యక్రమానికి గోరంట్ల మండలం నార్సింపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పివి శివారెడ్డి రూ.101016లు, అన్నదాన కార్యక్రమానికి మూడు క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ నెల 21-12-2025 ఆదివారం 17వ మండల పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే గత తొమిది సంవత్సరాలుగా మండల పూజా కార్యక్రమానికి పెయ్యాల శివారెడ్డి కుటుంబ సభ్యులు విరాళాన్ని అందజేస్తూ ఆలయ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నా వారికి వారి కుటుంబ సభ్యులకి శ్రీ అయ్యప్ప స్వామి ఎల్లవేళలా ఆ కుటుంబానికి ఆశీస్సులు అందజేయాలని వారు ఆకాంక్షించారు. ఈ సందరరేగా పి వి శివారెడ్డిని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దుశ్యాలవతో ఘనంగా సన్మానించారు. ఈ సందరరేగా పీవీ శివారెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం శ్రీ అయ్యప్ప స్వామి ఆలయాన్ని నిర్మాణం శ్రీకారం చేపట్టినందున ఆలయ నిర్మాణానికి కూడా ఆర్థిక సహాయం అందజేస్తానని ఆయన కమిటీ సభ్యులకు తెలిపారు. అలాగే కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి దాతల సహాయ సహకారాలు ఎంతో అవసరమని ప్రతి ఒక్కరూ ఈ ఆలయ నిర్మాణానికి తోడ్పాటు కావాలని వారు ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి గుంతపల్లి నరసింహులుస్వామి, కమిటీ సభ్యులు గుమ్మయ్య గారి పల్లి ఈశ్వర్ రెడ్డి స్వామి, రాజశేఖర్ రెడ్డి, సుబ్బిరెడ్డి, రంగనాథ్, ఆలయ అకౌంటెంట్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేత్రపర్వంగా

## అయ్యప్పస్వామి 35వ గ్రామోత్సవం





**పామిడి -సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** పామిడి అయ్యప్ప 35వ గ్రామోత్సవం శనివారం అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో కనుల పండువగా సాగింది. అయ్యప్పకు వేకువజామనే అభిషేకాలు అర్చనలు జరిగాయి. అయ్యప్ప దేవస్థానం నుండి పామిడి పురవీదుల గుండా మెయిన్ బజార్ బీసీసీ రోడ్ ఊరేగింపు కన్నుల పండుగగా సాగింది. దీక్ష చేపట్టిన అయ్యప్ప మాలదారులు మంగళ వాయిద్యాల మధ్య స్వామివారి పాటలు పాడుతూ ఉత్సవాన్ని ముందుకు సాగించారు. అయ్యప్ప ఆలయం దగ్గర అగ్నిగుండ ప్రవేశం జరిగింది అయ్యప్ప స్వాములు భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ గ్రామ కమిటీల ఏర్పాటు



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి సూచనల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలో పేతనంలో భాగంగా శనివారం సింహాద్రిపురం మండలంలో సుంకేసుల గ్రామ పంచాయతీలో గ్రామ కమిటీలను వేయడం అందులో సభ్యులను నిర్ణయించడం జరిగింది. ఈ పంచాయతీకి పరిశీలకులగా మార్కెట్ యార్డ్ ఎక్స్ ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి, పరశిలకులు జిల్లా కార్యదర్శి సాకం నీలవర్ధన్ రెడ్డి,సుంకేసుల గ్రామ సర్పంచ్ నారాయణరెడ్డి,పల్లెటి జగదీశ్వర్ రెడ్డి, పల్లెటి భార్గవ్ రెడ్డి, పల్లెటి అనిల్ కుమార్ రెడ్డి.జి.రామకోటి జి.సోమశేఖర్ రెడ్డి,ఆర్.చంద్రమౌళి, పి.వివేకానంద రెడ్డి, పి.పరమేశ్వర రెడ్డి, సి.మోహన్ రెడ్డి జి.పార్ధసారధి రెడ్డి. సోషల్ మీడియా విభాగం వెంకటరమణ రెడ్డి, మైనారిటీ నియో జకవర్గ విభాగం ముల్లా బషీర్, అన్నం సురేష్, షబ్బీర్, మరియు వైస్సార్సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ గ్రామ కమిటీలలో ఉన్నటువంటి ఆ సభ్యులందరికీ ఐడెంటి కార్డులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఇవ్వడం జరుగుతుంది. ఎవరైతే నికార్సుగా పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్నారో వారికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో గుర్తింపు కూడా కచ్చితంగా ఉంటుందని జగన్మోహన్ రెడ్డి చాలా గట్టిగా కూడ చెప్పారు. కావున కమిటీల్లో ఎన్నికైన సభ్యులు కార్యకర్తలు అందరూ పార్టీ కోసం రాబోయే రోజుల్లో గట్టిగా కష్టపడి పార్టీని బలపరుచుకొని 2029లో జగన్మోహన్ రెడ్డి నీ ముఖ్య మంత్రి చేసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కోర్ కమిటీ సమావేశం



**సింహాద్రిపురం- సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి సూచనల మేరకు సింహాద్రిపురం మండల పరిధిలోని లోమడ గ్రామంలో వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. శనివారం సింహాద్రిపురం మండలం లోమడ గ్రామంలో కోర్ కమిటీ సమావేశ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, గ్రామ అబ్జర్వర్లు ద్వారకానాథ్ రెడ్డి,ప్రసాద్ రెడ్డి, లోమడ వైకాపా నాయకులు పవన్ చంద్ర రెడ్డి, హృషికేశవ రెడ్డి, జనార్ధన్ రెడ్డి,జయచంద్ర రెడ్డి, దేవపుత్ర రెడ్డి, రవి రెడ్డి,మల్లికార్జున రెడ్డి, రాజబాబు, వి.రాజా, వీరప్రసాద్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నాగరాజు, సోషల్ మీడియా కార్యదర్శిలు భరత్ రెడ్డి, శ్రీకాంత్, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో 9 మంది విద్యార్థులకు అస్వస్థత









**తొండూరు- సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** తొండూరు మండలం యాదవవారిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం కింద భోజనం చేసిన 9 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. భోజనం అనంతరం పిల్లలకు కడుపునొప్పి, విరోచనాలు, వాంతులు రావడంతో పాఠశాల సిబ్బంది వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించారు.బాధిత విద్యార్థులను 108 అంబులెన్సుల ద్వారా పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న జిల్లా విద్యాశాఖాధికారి షేక్ షంసుద్దీన్, పులివెందుల రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ జి.చిన్నయ్యలు, తొండూరు మండల విద్యాధికారి భారతిలు పులివెందుల ఏరియా హాస్పిటల్‌కు చేరుకుని విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి షేక్ సంసుద్దీన్ మాట్లాడుతూ, ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపడతామని, మధ్యాహ్న భోజన నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు.

## పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్లాలి

### - జగనన్న పాలనలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు

### - 23వ వార్డులోఅనుబంధ విభాగ కమిటీల సమావేశం



**పులివెందుల - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు గంట మస్తాన్ వీధిలో వార్డులో అనుబంధ విభాగాల కోర్ కమిటీ సమావేశాన్ని వార్డు నాయకులు బండల మురళి, చంద్రమౌళిల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ వైకాపా ఇన్చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ చైర్మన్లు చిన్నప్ప, రసూల్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ పార్నపల్లె కిషోర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. వైసీపీ పట్టణఅనుబంధాల కోర్ కమిటీ సమావేశాలు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యన్నారు. వైయస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైయస్ అవినాష్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జరగబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సైనికుల్లా పనిచేస్తేనే కూటమి నాయకుల కుట్రలను తిప్పి కొట్టొచ్చు అన్నారు. ప్రభుత్వ వైఫల్యా లను వార్డులోని ప్రజలకు వివరించాలన్నారు. 2.0 జగనన్న పాలనలో కష్టపడిన ప్రతి ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుంద న్నారు. అలాగే పదవులు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీలను నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సోపాల వీర, కనక, సంపత్, దశరథ రామిరెడ్డి, రత్నం, కిషోర్, మాబ్జాన్, భాష, వినోద్, రమేష్, బాబు వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు పరుగులు పెట్టిస్తున్న టీడీపీ

- గుమ్మగట్టలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం : ఎమ్మెల్యే కాలువ
- 10 లక్షల కోట్లు ఆర్థిక భారం మోపిన వైసిపి ప్రభుత్వం...
- 17 కోట్ల తో భవనాలు రహదారులకు నిధులు మంజూరు....
- శాంతి భద్రతల పరిరక్షణకు రాజీపడం....
- వేనకపడ్డ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే మా లక్ష్యం....
- ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు







**రాయదుర్గం- సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** రాష్ట్రం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరుగులు పట్టిస్తున్నారని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిధిలోని గుమ్మగట్ట మండలంలో పలు అభివ ృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ.... గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రానికి 10 లక్షల కోట్ల ఆర్థిక భారం మోపి, రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టిందని ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు మండిపడ్డారు. తాళ్ళకెర గ్రామంలో నూతన పిహెచ్ సెంటర్ నిర్మాణానికి, పాలకేర నుండి తిమ్మాలా పురం వరకు సిసి రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. గుమ్మగట్ట మండల కేంద్రంలో మండల రీసెర్చ్ సెంటర్ భవనానికి భూమి పూజ చేశామన్నారు. గత వైసిపి ప్రభుత్వం స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర అభివ ృద్ధిని చేయకుండా, సంక్షేమాన్ని పూర్తిగా అటవెక్కించారని ఎమ్మెల్యే విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రతి నెల ఉద్యోగస్తులకు వేతనాలు ఇవ్వడానికి కూడా దయానియా పరిస్థితిని స ృష్టించారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు, గ్రామాల అభివ ృద్ధికి సీఎం చంద్రబాబు అభివ ృద్ధి దేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. దాదాపుగా 50 వేల కోట్ల పింఛన్లు అందిస్తూ, ఒకేసారి నాలుగు వేలు పెంచడం, సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, విద్యార్థికి 15000 ఆర్థిక సాయం, ఉచిత బస్ ప్రయాణం శ్రీశక్తి కింద ఇలా ఎన్నో సౌకర్యాలను ప్రజలకు అందుబాటులో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. బిటిపి కాకుండా, 17 కోట్ల నిధులతో నూతన రహదారులు భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వెనుకబడ్డ ప్రాంతా అభివృద్ధికి చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని, తాళ్లకేర గ్రామంలోనే 3.50 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. మొదట విడుదలో1.40 కోట్లతో రోడ్డు మంజూరు చేయిం చామన్నారు. ఇలా విడతలవారీగా అభివ ృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. శాంతి భద్రతలకు రాజీ పడకుండా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రాయదుర్గం ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే హర్షం వ్యక్తం పరిచారు. గత ప్రభుత్వం మాదిరిగా అక్రమాలకు పాల్ప డకుండా ఎవరు భూమి వారే దున్నుకునే విధంగా వారి కుటుంబం ప్రశాంతంగా ఉండడానికి కూటమి ప్రభుత్వం ప్రజలకు అండగా ఉందన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలలో కక్షలకు బెదిరింపులకు దౌర్జన్యలకు ఆస్కారం లేకుండా చేశామన్నారు. గత ప్రభుత్వం వైసీపీ పాలనలో కంటే కూటమి ప్రభుత్వంలోనే ప్రజలంతా ప్రశాంతంగా ఉన్నారని, సీఎం చంద్రబాబుపై ప్రజల ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని కాలువ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వచ్చే రెండేళ్లలో పాఠశాల భవనం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కాలువ హామీ ఇచ్చారు. చదువుకుంటున్న ప్రతి విద్యార్థి లందరికీ వసతి కల్పించడమే నా ఆకాంక్షాన్ని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యలో ప్రతి ఒక్కరు నైపుణ్యాన్ని సాధించాలని తల్లిదండ్రులకు ప్రతిష్టను తీసు కోరా వాలన్నారు. ఒక అమ్మాయి 95శాతం మార్కులు సాధించి న, ఆమె ధీమాను మనమంతా ఆమెను అభి నందిస్తూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్ర మంలో మండల కన్వీనర్ కాలువ సన్నన్న , మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ దానవీంద్ర, సర్పంచ్ విజయలక్ష్మి, నాగరాజు, పొట్ల రవి, సదాశివ, రాము, చిన్నికృష్ణ సంజీవ ప్రజలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నిమ్మకాయలను ప్రభుత్వమే కొని అమ్ముతోంది



**మదనపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** నిమ్మకాయల ధర అమాంతం పడిపోయిన నేపథ్యంలో రైతులను ఆదుకు నేందుకు ప్రభుత్వమే నిమ్మకాయలను కొంటుందని మార్కెట్ కమిటీ ఛైర్మన్ జంగాల శివరామ్ తెలిపారు. శనివారం ఆయన రైతు బజార్లో స్థానిక వినియోగదారులకు నేరుగా నిమ్మకాయలను పంపిణి చేశారు. ఈ సందరరేగా శివరామ్ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిమ్మ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. రైతుల నుంచి నేరుగా కిలో నిమ్మకాయలు రూ.20తో కొనుగోలుచేసి, రైతు బజార్లలో అదే రూ.20 లకే వినియోగదారులకు విక్రయిస్తుందన్నారు. కావున మీకు బజార్లో గిట్టుబాటు ధర లభించేవరకు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకుంటుందని స్పష్టం చేశారు.

## రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి



**మదనపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్యులను, వైద్యసిబ్బందిని ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశించారు. శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసు కున్నారు. నిమ్మనపల్లి మండలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై కొందరు వైసీపీ నాయకులు దాడి చేశారని తెలియగానే కార్యకర్తను పరామర్శించి పోలీస్ శాఖతో మాట్లాడి తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఇది వైసీపీ ప్రభుత్వం కాదని, కూటమి ప్రభుత్వమనే విషయాన్ని గుర్తు పెట్టుకుని జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సత్వర వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.రెడ్డి షంషీర్, బీదం గురునాథ్ యాదవ్, పెంచుపాడు స్వామి, బాలమాలి శేఖర్, రెడ్డి రాయల్, నయాజ్, చల్లా చలపతి తదితరులు పాల్గొన్నారు.

## మదనపల్లెలో దంపతులపై దాడి



**మదనపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** మదనపల్లెలో భార్యాభర్తలపై ప్రత్యర్థులు మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. శనివారం జరిగిన ఘటనపై బాధితులు తాలూకా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు పై వివరాలు.. మదనపల్లి సీటీఎం రోడ్డు, ఎరగాని మిట్టపై కాపురం ఉంటున్న రమేష్ బాబు అతని భార్య ఉషశ్రీ పైకి స్థానికంగా ఉండే ఇద్దరు వ్యక్తులు, చెత్త ఇంటి ముందువేస్తోందన్న సాకుతో గొడవపడి కొట్టారు. భార్యను కొడుతోండగా వెళ్లి అడ్డుకున్న ఆమె భర్త రమేష్ బాబును సైతం వారు తీవ్రంగా కొట్టి గాయపరచగా, కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రకి తరలించారు. ఘటనపై తాలూక పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రశాంతంగా నవోదయ పరీక్ష

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** మండలంలో ఏపీ మోడల్ స్కూల్లో శనివారం నవోదయ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు చీఫ్ సూపరిండెంట్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా 217 మంది పరీక్షకు దరఖాస్తు చేసుకోగా అందులో 197 మంది పరీక్షకు హాజర య్యారు. 20 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షకు రామాపురం లక్కిరెడ్డిపల్లి చక్రాయపేట గాలివీడు వీరబల్లి మండలాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. డిపార్ట్మెంటల్ చీఫ్ వెంకటసుబ్బయ్య, నవోదయ సీఎల్ఓ ప్రసాద్, ఏఎస్ఐ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## లోకాదళత్ ద్వారా సమస్యలు పరిష్కారం

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** లోకాదళత్ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని మండల్ లీగల్ అథారిటీ జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ పేర్కొన్నారు. జాతీయ లోకాదళత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టులో లోకాదళత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.6,37,264లు వసూలు అయినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. అనంతరం జడ్జి భరత్ కమల్ మాట్లాడుతూ క్షణికావేశంతో కేసులు పెట్టుకొని పోలీస్ స్టేషన్ కోర్టు చుట్టూ తిరగద్దని ఆయన అన్నారు. ఏదైనా సమస్య వస్తే సానుకూలంగా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. దీనివల్ల కుటుంబాలు వీధిన పడతాయని కక్ష దారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి చెన్న కృష్ణయ్య ఎస్ఐ రవీంద్రబాబు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.




## వైసీపీ నూతన గ్రామ కమిటీల నియామకం



**వేముల - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** వేముల మండలం గొందిపల్లె గ్రామంలో వైసీపీ నూతన గ్రామ కమిటీల నియా మకం వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పిటిసి కోగటం భయపు రెడ్డి, వేముల ఎంపిపి చల్ల గంగాదేవి వెంకటనారాయణ, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మరక శివ కృష్ణారెడ్డి యాదవ్, ఎంపీటీసీ కొత్తపల్లి మల్ రెడ్డి, ఎద్దుల విజయ భాస్కర్ రెడ్డి, కలంకుంట్ల గంగిరెడ్డి, రామాంజనే యులు, కల్లూరు చంద్ర ఓబుల రెడ్డి, రాజారెడ్డి, రమణారెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి, హరీష్, సుదర్శన్ రెడ్డి, చిన్న సిద్దయ్య, ఆంజనేయులు, రామిరెడ్డి, జిల్లా యువజన విభాగం సభ్యులు చల్లా సునీల్ కుమార్, సోషల్ మీడియా సోహెల్, పుల్లయ్య, మధు మోహన్ రెడ్డి, ఐటీ విభాగం సుభాష్ రెడ్డి వైసీపీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

## విద్యార్థిపై హత్యాయత్నం



**మదనపల్లె - సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** మదనపల్లిలో ఇంటర్ విద్యార్థి పై శనివారం రాత్రి ప్రత్యర్థులు మూకుమ్మడిగా దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. తీవ్ర కళకళ రేపుతున్న ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం చంద్రమాకుల పల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన రాజబాబు, కళావతి దంపతుల కుమారుడు నాయుని రెడ్డిప్రసాద్ (19) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువు తున్నాడు. ఈ క్రమంలో స్థానిక కోమటి వాని చెరువు వద్ద రెడ్డిప్రసాద్ ను చుట్టుముట్టి కాళ్లు చేతులతో తన్ని, గుద్ది, బెల్టుతో గొంతు బిగించి చరణ్ వర్గీయులు చంపేందుకు ప్రయత్నించారు. దెబ్బలకు స్పృహ కోల్పోవడంతో చనిపోయా డని నిందితులు వదిలేసి పరారయ్యారు. రక్తపు మడుగులో పడి ఉండగా స్థానికులు గుర్తించి, బాదితున్ని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి, ప్రథమ చికిత్స అనంతరం అతని పరిస్థితి విషమంగా ఉందని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనపై రెండవ పట్టణ పోలీసులు మరిన్ని వివరాలను వెల్లడించాల్సి ఉంది.

## కన్నుల పండుగగా హిందూ సమ్మేళనం



**వేంపల్లి - సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** వేంపల్లె పట్టణంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని కన్నుల పండుగగా నిర్వహించామని వేంపల్లె హిందూ సమ్మేళన నిర్వహణ సమితి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కడపకు చెందిన చిన్మయ మిషన్ పీఠాధిపతి తురియానంద స్వామి, శ్రీనివాసమంగాపురంకు చెందిన లలితాపీఠ వ్యవస్థాపక పీఠాధిపతి స్వస్వరూపానందగిరి స్వామి, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్ జీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.శ్రీ సీతారాముల వారికి పూజలు నిర్వహించారు. హిందూ సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, హిందూ ఐక్యతను మేలుకొలపాలని పిలుపునిస్తూ వారు ప్రసంగించారు.నేటి యువత మాదకద్రవ్యాలపై,చెడు అలవాట్లకు బానిసలు అవుతున్నారని తెలిపారు.వాటికి యువత పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.అలాగే మన హిందూ ధర్మంపై గతంలో జరిగిన దాడులను,ప్రస్తుతం జరుగుతున్న దాడులు, వాటిని ఎదుర్కోవాలంటేఏమిచేయాలని తెలిపారు.వేంపల్లిలో సుమారు 60 గోమాతలు ప్లాస్టిక్ వ్యర్థాలు,మొదలైనవి తిని శివైక్యం చెందాయని తెలిపారు. కులాలకు అతీతంగా,రాజకీయాలకు అతీతంగా హిందూ బంధువు లందరూ ఏకధాటిగా కలిసి మెలసి ఐక్యతగా మెలగాలనే సంకల్పంతో హిందూ సమ్మేళన కార్యక్రమం చేపట్టామన్నారు.ప్రతి హిందువులో సనాతన ధర్మాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుట కొరకై, హిందువులు కలిసిమెలిసి ఐకమత్యంతో ఉండాలన్న లక్ష్యంతో ఈ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ హిందూ సమ్మేళనం ద్వారా గ్రామ గ్రామాలలో హిందూ వాతావరణ నిర్మాణం చేయడం,మనమంతా హిందువులం, కులం మన ఇంటికే పరిమితం, గడప దాటితే మనమంతా హిందువులమనే భావనతో మన హిందూ దేవాలయాలను రక్షించు కోవడం మన ముఖ్య ఉద్దేశమన్నారు. వేంపల్లె మండలంలోని హిందువులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన స్కూల్ పాఠశాలల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పలు దేవాలయాల అర్చకులు, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.





# ‘ఉస్తాద్ భగత్ సింగ్’ తొలి గీతం విడుదల

## ‘దేఖ్‌లేంగే సాలా’ ఆవిష్కరణ వేడుక




‘గబ్బర్ సింగ్’ వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’. రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా ‘దేఖ్‌లేంగే సాలా’ విడుదలైంది. ఈ గీతావిష్కరణ కార్యక్రమం శనివారం సాయంత్రం రాజమండ్రిలో జరిగింది. అభిమానుల కోలాహలం నడుమ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకుడు హరీష్ శంకర్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్, నిర్మాత నవీన్ యెర్నేని, గీత రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రం నుంచి విడుదలైన తొలి గీతం ‘దేఖ్‌లేంగే సాలా’ అభిమానులు, సినీ ప్రేమికుల్లో ఒక్కసారిగా భారీ ఉత్సాహాన్ని రేపింది. ఉత్సాహభరితమైన సంగీతం, అద్భుతమైన నృత్య రీతులతో రూపొందిన ఈ పాటలో పవన్ కళ్యాణ్ తన అత్యంత ప్రజాదరణ పొందిన అవతారంలో కనిపిస్తున్నారు. వింటేజ్ స్టైల్, రా ఇంటెన్సిటీతో ఒకప్పుడు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆయన తన ఐకానిక్ బ్లాక్‌బస్టర్ పాటల జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేస్తున్నారు.ఈ పాటతో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ అనే బ్లాక్‌బస్టర్ త్రయం ఘనంగా మళ్లీ కలిసింది. గతంలో చార్ట్‌బస్టర్ పాటలు, గుర్తుండిపోయే మాస్ ఎంటర్‌టైనర్లను అందించిన ఈ త్రయం, ‘దేఖ్‌లేంగే సాలా’తో తన విజయ పరంపరను కొనసాగిస్తోంది. పదునైన దృష్టి, విశిష్టమైన సంగీత అవగాహనకు పేరుగాంచిన దర్శకుడు హరీష్ శంకర్.. మాస్, ఆధునిక అంశాలను మేళవిస్తూ రూపొందించిన ఈ పాటలో తన నైపుణ్యాన్ని మరోసారి నిరూపించారు. ప్రతి బీట్, ప్రతి స్టెప్, ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాటకు సమగ్ర ఆకర్షణను తీసుకొచ్చారు.సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ తన ఉత్సాహభరితమైన సంగీతంతో మరోసారి మాయ చేశారు. అడిగిన దానికంటే ఎక్కువ ఇచ్చే నిర్మాతలు నవీన్ గారు, రవిశంకర్ గారు. వారి వల్లే ఈ సినిమాకి ఇంత భారీతనం. విజయాలు వచ్చినా, పరాజయాలు ఎదురైనా ఎప్పుడూ ఒకేలా ఉంటారు. అందుకే మైత్రి సంస్థ దేశంలోనే అగ్ర నిర్మాణ సంస్థగా ఉంది. ఈ సినిమా పవన్ కళ్యాణ్ గారి వల్ల ఆలస్యమైందని కొందరు రాశారు. ఈ సినిమా పవన్ కళ్యాణ్ గారి వల్ల అసలు ఆలస్యం అవ్వలేదు. ‘ఉస్తాద్ భగత్ సింగ్’ ప్రయాణం గురించి వివరంగా చెబుతాను. మొదట ఒక ప్రేమ కథ చేయాలనుకున్నాం. కానీ, అభిమానులు గబ్బర్ సింగ్ లాంటి సినిమా కావాలని కోరుతుండటంతో సందిగ్ధంలో పడిపోయాం. అదే సమయంలో పాండమిక్ వచ్చింది. ఆ సమయంలో నేను కొంచెం డిప్రెషన్ లో ఉన్నాను. ఏ కథ చేయాలనే సందిగ్ధంలో నా వల్లే కొంచెం సమయం వృధా అయింది. ఒక రీమేక్ చేద్దామనుకొని అది కూడా పక్కన పెట్టాము. కొంచెం ఆలస్యమైనా పర్లేదు, అభిమానులందరూ మళ్ళీ మళ్ళీ చూసే సినిమా చేయాలని మా టీం అంతా కలిసి పని చేశాము. నిజానికి పవన్ కళ్యాణ్ గారి వల్లే చిత్రీకరణ త్వరగా పూర్తయింది. ఆయన మమ్మల్ని ఊపిరి ఆడనివ్వకుండా షూటింగ్ చేశారు. ఉదయాన్నే కేబినెట్ మీటింగ్ కి విజయవాడ వెళ్ళిపోయేవారు. రెండు రోజులు షూటింగ్ ఉండదేమో అనుకునేవాళ్ళం. కానీ, ఆయన రాత్రి పూట షూటింగ్ కి సమయం కేటాయించేవారు. ఉదయమంతా ప్రజాసేవలో ఉండి, రాత్రి ఫ్లయిట్ లో హైదరాబాద్ వచ్చి తెల్లవారుజాము వరకు షూటింగ్ చేసి, మళ్ళీ మంగళగిరి వెళ్ళిన రోజులున్నాయి. 18 గంటలు, 20 గంటలు పని చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈ సినిమాకి పవన్ కళ్యాణ్ గారు ప్రాణం పెట్టి పనిచేశారు. మనస్ఫూర్తిగా కళ్యాణ్ గారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. కళ్యాణ్ గారు ఎప్పుడూ ఒక్కటే చెబుతుంటారు.. ప్రయత్నంలో లోపం ఉండకూడదని. ప్రయత్నంలో లోపం లేదు కాబట్టే.. అపజయాన్ని చూసి కూడా ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నారు.” అన్నారు.

సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ మాట్లాడుతూ.. “ఇంతటి ఉత్సాహభరితమైన వాతావరణంలో ఈ పాట ఆవిష్కరణ వేడుక జరగడం చాలా చాలా సంతోషంగా ఉంది. మా నాన్న గారు దూరమై డిసెంబర్ 14కి పదేళ్ళు. ఆయన ఆశీస్సులతో ఒకరోజు ముందుగా ఈ పాటను విడుదల చేసుకోవడం ఆనందంగా ఉంది. హరీష్ శంకర్ గారు నాకు స్నేహితుడు, సోదరుడు లాంటి వారు. గబ్బర్ సింగ్, డీజే తరువాత మా కలయికలో వస్తున్న హ్యాట్రిక్ ఫిల్మ్ ఇది. సంగీతం, సాహిత్యం విషయంలో ఆయనకు గొప్ప అభిరుచి ఉంది. హరీష్ శంకర్ గారు సృష్టించిన సంచలనం గబ్బర్ సింగ్ ని అంత తేలికగా ఎవరూ మరిచిపోలేరు. జీవితంలో సమస్యలు రావడం సహజం. అప్పుడు మనం పాటించాల్సిన సూత్రం ఏంటో తెలుసా.. దేఖ్‌లేంగే సాలా. అదే ఈ పాట. ఒక కమర్షియల్ సినిమాలో, పవన్ కళ్యాణ్ గారి లాంటి అగ్ర కథానాయకుడుపై ఇలాంటి సందేశమిచ్చే పాటను రూపొందించే సందర్భాన్ని సృష్టించిన హరీష్ గారికి కృతజ్ఞతలు. సిచువేషన్ బాగుంటేనే పాట బాగా వస్తుంది. హరీష్ గారు ఇంత అద్భుతమైన సందర్భాన్ని ఇచ్చారు కాబట్టే.. పాట అద్భుతంగా వచ్చింది. భాస్కరభట్ల గారు అంతే అద్భుతంగా సాహిత్యం అందించారు. మైత్రి సంస్థ నాకు కుటుంబం లాంటిది. పవన్ కళ్యాణ్ గారిని ఎలా చూడాలని అభిమానులు చూడాలనుకుంటున్నారో అంతకుమించేలా హరీష్ శంకర్ గారు ‘ఉస్తాద్ భగత్ సింగ్’లో చూపించబోతున్నారు. ఈ సినిమా అభిమానులకు విందులా ఉంటుంది” అన్నారు.నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ.. “దేఖ్‌లేంగే సాలా పాట మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఇది ఆరంభం మాత్రమే.. ఈ సినిమా నుంచి వచ్చే ప్రతి కంటెంట్ ఈ స్థాయిలోనే ఉంటుంది. పవన్ కళ్యాణ్ గారితో సినిమా చేయడానికి పది సంవత్సరాలు పట్టింది. పవన్ గారు, హరీష్ గారి కలయికలో మా బ్యానర్ లో సినిమా చేయడం సంతోషంగా ఉంది. అలాగే దేవిశ్రీ గారు మా బ్యానర్ లో చేసిన ప్రతి మూవీ బ్లాక్ బస్టరే. త్వరలోనే ఈ సినిమా మీ ముందుకు వస్తుంది. ఖచ్చితంగా ఘన విజయం సాధిస్తుందని నమ్మకం ఉంది.” అన్నారు.

గీత రచయిత భాస్కరభట్ల మాట్లాడుతూ.. “నేను చదువుకున్న రాజమండ్రిలో ఈ కార్యక్రమం జరగడం సంతోషంగా ఉంది. హరీష్ శంకర్ అన్నయ్య అంటే నాకు చాలా ఇష్టం. గబ్బర్ సింగ్ లో దిల్ సే దిల్ సే అనే పాట రాశాను. మళ్ళీ పవర్ స్టార్ గారు, హరీష్ గారు, దేవి గారి కాంబినేషన్ లో వస్తున్న ఈ సినిమాకి రాయడం ఆనందంగా ఉంది. ఈ పాట రాసేటప్పుడు హరీష్ ఒక్కటే మాట అన్నారు.. దిగాలిగా ఉన్నోడు లెగాలి అని. ‘దేఖ్‌లేంగే సాలా చూసినాంలే చాలా’ అనే మకుటం కూడా ఆయనే ఇచ్చారు. పవన్ కళ్యాణ్ గారి ప్రసిద్ధ డైలాగ్ ‘మనల్ని ఎవడ్రా ఆపేది’ని స్ఫూర్తిగా తీసుకొని సాహిత్యం రాశాను. ఈ పాట ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఎదుచూశాను. ఈ ఏడాది చిరంజీవి గారికి ‘మీసాల పిల్ల’, పవన్ గారికి ‘దేఖ్‌లేంగే సాలా’ రచించడం గర్వంగా ఉంది. ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సాధించబోయే విజయం కోసం మీ అందరిలాగే నేను కూడా ఎదురుచూస్తున్నాను.” అన్నారు. ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవి శంకర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు ఉండగా, ‘దేఖ్‌లేంగే సాలా’ పాటతో ఆ అంచనాలు రెట్టింపు అయ్యాయి. ‘దేఖ్‌లేంగే సాలా’ పాటతో వచ్చిన ఊపు చూస్తే, ఈ చిత్రం రాబోయే రోజుల్లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మాస్ ఎంటర్టైనర్లలో ఒకటిగా నిలవడం ఖాయంగా కనిపిస్తుంది.

## వెంకీ కుడుముల నిర్మాతగా..



డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా మారి హ్యాష్ ట్యాగ్‌తో ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాతో కొత్త వ్యక్తి హీరోగా డెబ్యూ ఇస్తున్నారు. అతడెవరనేది మాత్రం చిత్రబృందం సస్పెన్స్‌లో పెట్టింది. వెంకీ కుడుముల లాంచ్ చేసిన బ్యానర్‌లో ఈ సినిమా రాబోతుంది. మలయాళ నటి అనస్వర రాజన్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్ థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి రాజ మహదేవన్ సినిమాట్రోఫర్. న్యూ ఏజ్ ప్రాజెక్ట్ డ్రామా నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో కొత్త నటీనటులతోపాటు పాపులర్ యాక్టర్లు నటించనున్నారని సమాచారం. ఈ మూవీ టైటిల్ గ్లింప్స్ నేడు లాంచ్ చేయనున్నారు.



# గిల్, సూర్యకుమార్ రాణిస్తేనే

- నేడు దక్షిణాఫ్రికాతో మూడో టి20
- దూబే స్థానంలో సంజుకు చోటు
- రాత్రి 7.00గంఎలకు



**ధర్మశాల:** ఐదు టి20ల సిరీస్‌లో భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య ధర్మశాల వేదికగా ఆదివారం మూడో టి20 జరగనుంది. తొలి రెండు టి20ల్లో ఇరుజట్లు ఒక్కో మ్యాచ్ గెలిచి 1-1తో సమంగా ఉన్నాయి. ఈ క్రమంలో మూడు టి20లో గెలిచిన జట్టు సిరీస్ ఆధిక్యతలో నిలవనుంది. వచ్చే ఏడాది ప్రారం భంలోటి20 ప్రపంచకప్ ఉన్న క్రమంలో టీమిండియా పటిష్ట జట్టును సిద్ధం చేసుకోవాల్సిన పరిస్థితి. ముఖ్యంగా ఓపెనర్ శుభ్‌మన్ గిల్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్‌లో వైఫల్యం అభిమానులను కలచివేస్తోంది. మూడో టి20 జరిగే హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాల మైదానంలో రాత్రిపూట మంచు దట్టంగా కురిచే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఛేదనకు దిగే జట్టు పరుగులు రాబట్టాలంటే కష్టపడాల్సిందే. దాదాపు 1500మీ. ఎత్తులో ఉన్న హిమాచల్ క్రికెట్ అసోసియే షన్(హెచ్‌పిసిఎ) స్టేడియంలో రాత్రిపూట మ్యాచ్ యుద్ధభూమిని తలపిస్తుంది.

### అందరి దృష్టి గిల్, సూర్యకుమార్‌పైనే

టి20ల్లో శుభ్‌మన్ గిల్ చోటు ప్రమాదంలో పడింది. ఈ ఫార్మాట్‌లో అతడు ఆశించిన స్థాయిలో రాబట్టలేకపోతున్నాడు. గత రెండు టి20ల్లో అతడు చేసిన పరుగులు 4(4 ం 0). ఇక కెప్టెన్ సూర్యకుమార్ పరిస్థితి కూడా ఏమంత బాగోలేదు. కెప్టెన్ కాకముందు ఈ ఫార్మాట్‌లో పరుగులు వరద పారించిన అతడు.. కెప్టెన్ అయ్యాక ఘోరంగా విఫమవుతున్నాడు. టీమిండియాకు ఊరటనిచ్చే అంశమేమిటంటే అతడు సారథ్యం వహించిన 6 సిరీస్‌లలో టీమిండియా ఒక్క సిరీస్‌నూ చేజార్చుకోలేదు. దీంతో అతడు కేవలం టాస్‌కి మాత్రమే పరిమితమౌతున్నాడని మాజీ క్రికెటర్, విశ్లేషకుడు ఆకాశ్ చోప్రా చురక అంటించాడు. ఇక దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టి20ల్లోనూ సూర్యకుమార్ చేసింది 17(12 ం 5) పరుగులే. దీంతో వీరిద్దరి ప్రదర్శనపై అభిమానుల్లోనూ కొంత నిరుత్సాహం నెలకొంది. మరోవైపు ఆల్‌రౌండర్ దూబే కూడా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టి20ల్లో ఘోరంగా విఫలమయ్యాడు. దీంతో బ్యాటర్ ఆర్డర్‌ను బలోపేతం చేసుకోవాలంటే దూబే స్థానంలో సంజు శాంసన్‌ను రెగ్యులర్ బ్యాటర్‌గా తుది జట్టులో చోటు దక్కే ఛాన్స్ ఉంది.

**జట్లు(అంచనా):**

ఇండియా: సూర్యకుమార్(కెప్టెన్), శుభ్‌మన్(వైస్ కెప్టెన్), అభిషేక్, తిలక్ వర్మ, హార్దిక్, దూబె, అక్షర్, జితేశ్(వికెట్ కీపర్), బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్.
దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్(కెప్టెన్), డికాక్(వికెట్ కీపర్), జోర్జి, బ్రెవీస్, డేవిడ్ మిల్లర్, యాన్సెన్, మహరాజ్, నోర్జె, ఎన్గిడి, బార్ట్‌మన్, స్టబ్స్/హెండ్రిక్స్.

# రేవంత్ రెడ్డి × మెస్సీ

- ఉప్పల్ స్టేడియంలో ఫుట్‌బాల్ ఫ్రెండ్లీ మ్యాచ్
- పోలీసులు భారీ బందోబస్తు



**హైదరాబాద్ బ్యూరో :** అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ ‘గోట్ టూర్ ఆఫ్ ఇండియా’లో భాగంగా శనివారం రాత్రి ఉప్పల్ స్టేడియంలో ‘గోట్ కప్’ పేరుతో ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా మెస్సీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జట్ల మధ్య ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. సింగరేణి ఆర్ఆర్ టీమ్ తరఫున మైదానంలో దిగిన సిఎం రేవంత్‌రెడ్డి వచ్చీ రావడంతోనే తొలి గోల్ కొట్టారు. మెస్సీ రెండో గోల్స్ రాబట్టారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇరుజట్లతో కలిసి మెస్సీ, రేవంత్ ఫొటోలు దిగారు. గ్యాలరీలో ఉన్న అభిమానులకు మెస్సీ.. ఫుట్‌బాల్ కిక్ చేసి గిఫ్ట్‌గా ఇచ్చారు. రాహుల్ గాంధీతో పాటు ప్రియాంకగాంధీ కుమారుడు, కుమార్తె ఫుట్‌బాల్ మ్యాచ్‌ను వీక్షించారు. శనివారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్ వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి శంషాబాద్ విమానాశ్రయంలో సిఎం రేవంత్ స్వాగతం పలికారు. అక్కడ నుంచి రాహుల్ తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడే విశ్రాంతి తీసుకుని రాత్రి 7.30గంటలకు ఉప్పల్ స్టేడియానికి చేరుకున్నారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ వచ్చిన అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీకి శంషాబాద్ విమానాశ్రయం వద్ద అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఎయిర్ పోర్టు నుంచి నేరుగా ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లారు. అక్కడ వందమందితో ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం 6.30 గంటలకు మెస్సీ బృందం ఉప్పల్ స్టేడియానికి చేరుకుంది. మెస్సీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. కోల్‌కతాలో ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు బందోబస్తు పెంచి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తపడ్డారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోనే బసచేసిన మెస్సీ బృందం ఆదివారం ఉదయం ముంబయికి బయల్దేరి వెళ్లనుంది.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికను

# జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయ వచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

**15న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక**



ఈ నెల 15వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్‌ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్‌గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# భక్తుల సంతృప్తే మా ఆకాంక్ష

### - ముక్కోటి ఏకాదశికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం
### - ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



**కదిరి– సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** కదిరి నియోజకవర్గంలోని భక్తులు ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకుని వారు తృప్తి పడడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా కదిరిలో వెలసిన శ్రీమద్ ఖాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈ నెలాఖరులో నిర్వహిoచనున్న ముక్కోటి ఏకాదశి సందరరేగా కదిరి నియోజకవర్గం లోని ప్రజలందరికీ దర్శన భాగ్యం కల్పించనున్నట్లు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు ముక్కోటి ఏకాదశి సందరరేగా శనివారం ఆయన ఖాద్రి ఆలయ ప్రధాన అర్చకులు న సింహాచార్యులు పార్థసారథిచార్యులతో అత్యవసర భేటీ అయి ముక్కోటి ఏకాదశి నిర్వహణపై సుదీరంగా చర్చించారు కదిరి పరిసర ప్రాంతాల నుంచి కాకుండా ఉమ్మడి అనంతపురం జిల్లా చిత్తూరు తిరుపతి అన్నమయ్య జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్రం నుంచి లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఖాద్రి నరసింహస్వామి దర్శన భాగ్యాన్ని కల్పించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భక్తులకు ఆలయాలలో సకాలంలో దర్శన భాగ్యం కల్పించాలని దృఢ సంకల్పంతో ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు గత వైసిపి ప్రభుత్వం ఆలయాలలో భక్తులకు కనీస సౌకర్యాలను కూడా కల్పించకుండా గాలికి



వదిలేసినట్లు ఆరోపించారు అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భక్తులందరినీ పార్టీలకతీతంగా చూస్తూ సకాలంలో దర్శనమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. భక్తులందరి సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తామన్నారు. భక్తులకు ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శన అనంతరం వారు సంతోషంగా ఇంటికి పంపే బాధ్యత తీసుకుంటామన్నారు.

ఈ ప్రభుత్వంలో సనాతన ధర్మాన్ని, పాటిస్తూ ఆలయాల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యా చరణతో ముందుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. విజ యవాడ చెందిన ఫ్లవర్ డెకరేషన్ చేసే వ్యక్తులతో కలిసి డెకరేషన్ చేసే విధానంపై కూడా క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో టిడిపి నాయకులు కూనక పుల్లయ్య, చంద్రశేఖర్, సుధీర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సగర కులస్తుల ఉచిత వివాహ

# పరిచయ వేదిక కరపత్రాల విడుదల

**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** ప్రొద్దుటూరు లోని జిల్లా సగర సంఘము కార్యాలయంలో ఈనెల 25వ తేదీ ఉచిత వివాహ పరిచయ వేదిక కు సంబంధించిన కరపత్రాలను గౌరవ అధ్యక్షులు పంజగల మురళి కల్పలత, బ్యాంకు మేనేజర్ ఉప్పర కొండయ్య, ప్రొద్దుటూరు పట్టణ గౌరవ అధ్యక్షులు రాజువారి వెంకట సుబ్బయ్య లు సగర సంఘము కార్యాలయం లో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సగర జె.ఏ.సి ఆధ్వర్యంలో 3వ సారి ఉచిత పరిచయ వేదిక ఏర్పాటు చేయడం అభినందించ తగ్గ విషయం అన్నారు. ఈ వేదికను రాష్ట్రంలోని సవర కులస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర సగర జేఏసీ చైర్మన్ మాదాసు మురళి మాట్లాడుతూ వివాహ పరిచయ వేదికను పెళ్లి కానీ యువతి యువకులు మీ బయోడేటా, ఫోటోలను 22 తారీకు లోపల అందజేసి మీ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ



కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మాజీ మేనేజర్ వర్రా చిన్న మద్ది లేటి, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి ఎక్కలూరు సురేష్, గౌరవ అధ్యక్షుడు వంగనూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బిటెక్ రవిని కలిసిన

## కడప జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



**వేంపల్లి – సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** కడప జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కూటమి నాయకుడు దాసరి భాను ప్రకాష్ శనివారం వేంపల్లెలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బిటెక్ రవితో ఆయన మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. చైర్మన్‌గా ఎంపికైన దాసరి భాను ప్రకాష్‌ను బిటెక్ రవి, అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, కూటమి నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంపల్లె ఇన్‌చార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, మండల ఇన్‌చార్జ్ మునిరెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షబ్బీర్, మొహమ్మద్, డక్కా రమేష్, బాబు షరీఫ్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

### - ఒకరి పరిస్థితి విషమం



**గోరంట్ల– సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** గోరంట్ల పట్టణంలోని హిందూపురం రోడ్డులో గల మార్కెట్ యార్డ్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు గాయపడగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా మారిన సంఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రుని తల్లి రామలక్ష్మమ్మ తెలిపిన వివరాల మేరకు సిరగం వాండ్లపల్లి గ్రామానికి చెందిన అశోక్ కుమార్ (30) సతీష్ కుమార్‌లు ట్రాక్టర్ గ్యారేజ్ వద్దకు వెళ్ళి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మోర్ సూపర్ మార్కెట్ ఎదుట ఎదురుగా వెళుతున్న ముగ్గురు యువకులు ఒకే ద్విచక్ర వాహనంలో కుడి వైపుకు తిరగడంతో వారి ద్విచక్ర వాహనాన్ని తగిలి కింద పడ్డారు. దీంతో అశోక్ కుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వినోద్ కుమార్ ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించి నట్లు తెలిపారు. సతీష్ కుమార్‌కు స్వల్ప గాయాలు కావడంతో ప్రథమ చికిత్సలు నిర్వహించారు. అశోక్ కుమార్ తల్లి రామలక్ష్మమ్మ జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

## మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని

## సన్మానించిన జలదంకి మదన్ మోహన్ రెడ్డి




**నాయుడుపేట– సూర్య వాస్తవం, డిసెంబర్ 13:** ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ(ఆర్ సి డి ఎస్) రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు జలదంకి మదన్ మోహన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. శనివారం నెల్లూరు నగరంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని జలదంకి మదన్మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందరరేగా కాకాణి గోవర్ధన్ రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ అభివృద్ధికి సహకరించాలని మాజీ మంత్రిని కోరారు. అందుకు స్పందించిన కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆర్సిడిఎస్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

## దృఢ సంకల్పంతో గ్రామం కమిటీల ఏర్పాటు

### - జడ్పిటిసి ఎం.రవికుమార్ రెడ్డి

**వేంపల్లి–సూర్య వాస్తవం, డిసెంబర్ 13 :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ఎంపీ అవినాష్ రెడ్డి సూచన మేరకు వేంపల్లి మండల గ్రామ కమిటీలన్నీ దృఢ సంకల్పంతో పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందని ఇందులో భాగంగా వేంపల్లి మండలంలో గత వారం రోజుల నుండి రోజుకు మూడు ప్రాంతాలలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం ఈ కమిటీల ద్వారా సభ్యులను ఎంచుకోవడం జరిగిందని తెలిపారు.ఇప్పటివరకు జరిగిన కమిటీలకు కార్యకర్తలు చాలా ఉత్సాహంగా పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఈ కమిటీలు పార్టీ బలోపేతానికి ఎంతో ఉపయోగపడతాయని ఈ కమిటీల ద్వారా ఎంతో ఉత్సాహంగా కార్యకర్తలు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. దాదాపు 9 కమిటీలు కమిటీకి పది మంది సభ్యులు మొత్తం 90మంది సభ్యులు ఉంటారని ఒక గ్రామ పంచాయతీ నుండి పదిమంది సభ్యులు ఉంటారు. ఈ 90 మంది నుండి డెవలప్మెంట్ గురించి సమిష్టి కృషి చేసే విధంగా ఉంటుందని తెలిపారు. ఈ కమిటీలో ఉన్న ప్రతి ఒక్కరి డేటా సేకరించడం జరుగుతుందని, వీరికి ముఖ్యంగా ఐడి కార్డులు వైయస్సార్ పార్టీ కార్యాల యం నుండి ఇవ్వనుందని, ఈ ఐడి కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి, మైనార్టీ నాయకులు మున్నీర్,వి ప్రసాద్, గిడ్డింగ్ వారి పల్లి, బక్కన్న గారి పల్లె గ్రామస్తులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )